ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

డిసెంబర్ 18, 2005

బడ్డీలకు టెడ్డీఫోన్లు

హ్యాపీ బర్త్‌డే

(18.12.2005 నుంచి
24.12.2005 వరకు)

వి. ఉత్తేజ్ బాబు
5సం॥, 18.12.2000
వరలక్ష్మి-ఉదయ్‌కుమార్
మహబూబ్‌నగర్

వినీత
2సం॥, 19.12.2003
సంపత్
చిదురుప్ప-సంగారెడ్డి

వై. రాగసుధ
5సం॥, 20.12.2000
ప్రభావతి-రమణయ్య
శ్రీకాళహస్తి-చిత్తూరు

జి. సాయి ప్రియాంక
5సం॥, 20.12.2000
స్వప్న-రాజు
ఆత్మకూరు-మ॥నగర్

సిహెచ్. ప్రవళిక
5సం॥, 18.12.2000
కవిత-వెంకటరమణారావు
వనస్థలిపురం-హైదరాబాద్

ఎస్. రోహిత్
6సం॥, 21.12.1999
పూర్ణిమ-రామకృష్ణ
ఎమ్మిగనూర్-కర్నూలు

సిహెచ్. చిన్నబాబు
1సం॥, 22.12.2004
పార్వతి-సత్తిబాబు
అరకువేలి-విశాఖ

పి. సుస్మిత
5సం॥, 22.12.2000
సువర్ణ-అంబన్నాచారి
గోరిబాళ్-కర్ణాటక

కె. అభిషేక్
6సం॥, 21.12.1999
కాంతమ్మ-ఏసురత్నం
భానూరు-మెదక్

అరవింద్-ఝాన్సీదేవి
డిసెంబర్-24
తాయమ్మ-రాముడు
కోసిగి-కర్నూలు

జి. జయంత్
1సం॥, 19.12.2004
విజయకుమారి-రమేష్
కొక్కిరేణి-ఖమ్మం

ఎ. ఫరహనా
9సం॥, డిసెంబర్-1996
జమీలాబేగం-నిరంజన్
సంతోష్‌నగర్-హైదరాబాద్

వి. బన్ని
3సం॥, డిసెంబర్-2002
నీరజ-వెంకటేష్
నర్సాపూర్-మెదక్

బి. ఆదిత్య సాయికుమార్
2సం॥, డిసెంబర్-2003
చంద్రవతి-అన్నాజీరావు
మాధవధార-విశాఖపట్నం

జి.ఆర్.జె.వి.ప్రసాదిని
1సం॥, డిసెంబర్-2004
జయలక్ష్మి-గోపి
దాసన్నపేట-విజయనగరం

పి. శ్రావణ్‌రెడ్డి
1సం॥, డిసెంబర్-2004
స్వప్న-రాజిరెడ్డి
ఉప్పుగల్-వరంగల్

బి. శైలజ
3సం॥, డిసెంబర్-2002
స్వరూప-శ్రీనివాస్
కొండపల్లి-కృష్ణా

ఎం. బ్లెస్సీ
రజని-దేవవరకుమార్
మధిర-ఖమ్మం

మానస్
1సం॥, డిసెంబర్-2004
విజయరాఘవి-రమేష్‌బాబు
సింగ్‌నగర్-విజయవాడ

జె.వి.పి. సాయితేజ
శారదాదేవి-ప్రసాదరావు
యర్రగొండపాలెం-ప్రకాశం

పి. ప్రణీత్ చందర్
వసంత కళ్యాణి-పాశర్ల ప్రసాద్
సింహాచలం- విశాఖపట్నం

లక్ష్మీసరస్వతి
1సం॥, డిసెంబర్-2004
ఉషారాణి-శ్రీనివాసరావు
విజయవాడ

సాలేహా-మైనా-హల్లు
మోబీనా-మజహర్
బుచ్చిరెడ్డిపాలెం-నెల్లూరు

డి. జాషువా
6సం॥, డిసెంబర్-1999
దేవమ్మ-అబ్రహాం
ధరూరు-మ॥నగర్

ఇ. కృతి
3సం॥, డిసెంబర్-2002
రమణకుమారి-శ్రీధర్
తిలక్‌నగర్-హైదరాబాద్

ఈ వారం అతిథి



మన అతిథి గురించి...

పేరు	:	నటరాజ రామకృష్ణ.
ఊరు	:	ఇండోనేషియాలోని బాలి ద్వీపంలో పుట్టారు (తల్లి: కొలనుపాక, తండ్రి : కోనసీమ).
పుట్టిన తేదీ	:	21-3-1923.
విద్య	:	నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి గ్రాడ్యుయేషన్
వృత్తి	:	ఆంధ్రప్రదేశ్ ఆస్థాన నాట్యాచార్యులుగా చేసి రిటైర్ అయ్యారు.
నచ్చిన వ్యక్తి	:	మహాత్మాగాంధీ
నచ్చని అంశం	:	ఆత్మస్తుతి, పరనింద, ఈర్ష్య, ద్వేషం, అసూయ.
అలవాటు	:	హృదయాంతరాళంలో దాగున్న కళ గురించి చెప్పటం.

కళలు విలువలను వికసింపజేస్తాయి

ఏ సమాజానికైనా, ఏ సంస్కృతికైనా కొన్ని లోపాలూ, ఎక్కువ సుగుణాలుంటాయి. చిన్న చిన్న లోపాలు ఉన్నప్పటికీ మన సంప్రదాయం ఉత్తమమైనది. జాతి, జాతి ఔన్నత్యం, వికాసాల్ని ఈ లోకానికి తెలియపరచాలి. దీనికోసం జాతికొక సందేశమివ్వాలి. ఈ క్రమంలో మన కళలను కూడా ప్రపంచానికి తెలియజేయాలి. మనం మన కళల్ని, కళాకారులను చిన్నచూపు చూస్తున్నాం. అలా చేయకూడదు. ఎందుకంటే కళాకారులు ఈ సమాజానికి అవసరమైనవాళ్లు అని నా అభిప్రాయం. మనం నమ్మిన సత్యాన్ని, ఆదర్శాన్ని ప్రదర్శించి, ఉత్తమమైన జాతిగా మనవాళ్లని చూపాలి. ప్రయోగాలు కాకుండా, కొన్ని అంశాలను తీసుకుని కళపై సిద్ధాంతంతో తెలియచెప్పాలి. ఏ రంగంలోనైనాసరే మనమెవ్వరికీ తీసిపోము. ఇది చెప్పటమే కాదు, మనం చేసి చూపించాలి. దేశ సౌభాగ్యం, కీర్తి ఈ ప్రపంచానికి చాటాలి. కొంతమంది ఈ దేశంలో పుట్టడం పూర్వజన్మలో చేసిన పాపంగా భావిస్తున్నారు. అందుకే ఇవన్నీ చెప్పాల్సి వస్తోంది. మన యువత కొంత పక్కదారి పట్టిఉన్న మాట వాస్తవమే. అలా పక్కదారి పట్టటానికి కారణం ఏవిటి? వారిలో ఉండే సహజాతిసహజమైన చేతన. అలాంటి డైనమిక్ స్పిరిట్‌తో ఉన్న యువత మనకు నేచురల్ రిసోర్స్. అయితే వారు భావోద్రేకానికి గురికాకుండా చూస్తేనే మనకు, దేశానికీ ప్రయోజనం. ఏ దేశపు కళాసంస్కృతులైనా అలాంటి బాధ్యతను నిర్వర్తించగలదని కళాకారుడిగా నా విశ్వాసం. కళలు ప్రజల బాగుకోరి వారిని సరైన దారిలో నడిచేవిధంగా మలచగలగాలి. కళల ద్వారా మానవీయ విలువలు నిలబడతాయి, వికసిస్తాయి.

రామకృష్ణ

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్‌పాయింట్ ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
సెన్సూ కామన్ సెన్స్ 20
ఓ ఊరి కథ ... 21

సీరియల్ 8
మాధవి

ఇంకా,,,



నేర్చుకుందాం రా 7
మీరూ వేయగలరు!

ఆరోగ్యం ... 17
మనసా తెలుసా ... 19
ఓ ఊరి కథ ... 21
అవీ... ఇవీ 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

కథ 18
అసలు గెలుపు...!

ఎదురుచూస్తుంటాం...

మేం ప్రతివారమూ స్నేహ మేగజైన్‌ను క్రమం తప్పక చదువుతాం. అన్ని శీర్షికలూ నచ్చుతున్నాయి. 'ఇంటి సంగతులు' శీర్షికలో 'ఇంట్లో చేసేది పనికాదా' చాలా నచ్చింది. మీరు తగిన బొమ్మలతో రచనలకు మరింత అందాన్ని చేకూరుస్తున్నారు. చక్కటి విషయాలు మిళితం చేసి రాస్తున్నారు. ఇట్లాంటి చక్కటి రచనలు చదవాలని మేం ఆకాంక్షిస్తున్నాం. ఆడవాళ్లు ఇంట్లో ఉండి చేస్తున్న పనులు ఇందులో తెలియజేసిన తీరు బాగుంది. ఇంత చక్కని రచనలు అందిస్తున్న మీకు మా ధన్యవాదాలు. తెలుపుతూ..

ఎమ్. ఉష, ఎమ్. సునీత, బాబూ క్యాంప్, కొత్తగూడెం, డి. ప్రీతి, స్వాతి, కొత్తగూడెం, వి. రోహిణి, పి సింధు, శ్రావణి, శ్రీవాణి, పాల్వంచ



కాదంటామా?

డిసెంబరు 4 నాటి స్నేహాలో 'నేర్చుకుందాం రా...' శీర్షికలో 'పోస్టుకార్డు పై పెయింటింగ్' ఎంతో నచ్చింది. మనిషి అంతరాత్మకు నిలువుటద్దమైన ఉత్తరం... కళాప్రతిరూపానికి సజీవ సాక్ష్యం అంటే కాదంటామా? అర్ధరూపాయి ఖర్చుతో ఆహ్లాదపరిచే ఆలోచనాత్మక పెయింటింగ్‌ను ఎలా చేయాలో చక్కగా చెప్పారు. రంగుల కలగలుపును చాలా చక్కగా వివరించారు. కృతజ్ఞతలు. 'ఆరోగ్యం' శీర్షికలోని బయోటిన్ విటమిన్ గూర్చి తెలుసుకున్నాం. ప్రతివారమూ సరికొత్త సొగసుతో అలరించే 'స్నేహ' అంటే మాకెంతో ఇష్టం.

ఆర్. రాజావల్లి హిమకుంట్ల, కడప జిల్లా

త్యాగ నిరతి

ఈ వారం స్నేహలోని అన్ని అంశాలూ చదివాను. ప్రతివారమూ టర్నింగ్ పాయింట్ శీర్షికలోని వ్యాసాలు చాలా బాగుంటున్నాయి. దుర్గాబాయమ్మ స్త్రీల సంక్షేమానికి చేసిన సంఘసేవ అమోఘం. పది సంవత్సరాల వయస్సులోనే జాతీయోద్యమానికి నిధులు సేకరించడమే కాకుండా, గాంధీజీ అడిగిన వెంటనే తన చేతి బంగారు గాజులు తీసి ఆయన చేతిలో పెట్టడం ఆమె త్యాగ నిరతిని చాటి చెబుతుంది.

దివ్య, కొత్తగూడెం, ఖమ్మం

శ్లాఘనీయం

నాయుడమ్మ వ్యాపారార్థం కాని వైద్యసేవలు శ్లాఘనీయం. స్త్రీ జనానికి అమోఘసేవచేసిన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ధన్యురాలు. భారతనావికాదళ వైశిష్ట్యాన్ని చక్కటి వ్యాసంగా అందించారు. బాగుంది. చరిత్ర కలిగిన నావికాస్థలంగా విశాఖ అభివృద్ధి చెందడం మనరాష్ట్రానికే గర్వకారణం. నటనా వైరుధ్యం గురించి 'రావి' కబురు నిజమైనదిగా ఉంది. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వెలువరించిన చిరు వ్యాసం బహుక్లుప్తంగా ఉంది. పుస్తక సమీక్ష బాగుంది. ముఖ చిత్రం కాస్ట్లీగా ఉంది. బాలల కథ, రుచిలోని వంటలు విశదంగా ఉన్నాయి.

వాస్తు రామచంద్ర, రాంజీ నగర్, నెల్లూరు - 2

సులభంగా...

'ఆరోగ్యం' శీర్షికలో విటమిన్ హెచ్ ద్వారా ఒక కొత్త విటమిన్ గురించి వివరంగా తెలుసుకున్నాం. 'అవీ... ఇవీ...' అలరించింది. టర్నింగ్‌పాయింట్ వల్ల గాంధీజీ ఆంధ్రప్రదేశ్ పర్యటన వివరాలు, తదితర అంశాలు మాకవగతమయ్యాయి. 'నేర్చుకుందాం... రా...' లో పోస్టుకార్డుపై పెయింటింగ్ అంశాలు చాలా ముచ్చటగొలిపాయి. సులభంగా నేర్చుకునేట్లుగా వివరించారు. 'సినిమా కబుర్లు' ద్వారా రావికొండలరావు మనోభావాలు తెలుసుకున్నాం. వచ్చేవారం రావుగారు చెప్పే విషయాల కోసం ఎదురుచూస్తూ...

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం జంక్షన్, శ్రీకాకుళం టౌన్

అద్భుతం

సముద్ర మార్గం ద్వారా అక్రమంగా రవాణా అవుతున్న బంగారాన్ని, మాదక ద్రవ్యాలను అడ్డుకోవడానికి కోస్టుగార్డు సేవలను ఉపయోగిస్తున్న విధానం అద్భుతం. హిందూమహాసముద్రం భారతదేశానికి సొత్తుకాదని కొన్ని అగ్రరాజ్యాలెందుకు రంకెలేస్తున్నాయో తెలియడం లేదు. హిందూ మహా సముద్రంలో ఒకటిన్నర కోట్లటన్నుల మత్స్య సంపద ఉన్నప్పటికీ దాన్ని పూర్తిస్థాయిలో మనం పొందక పోవడం నిరుత్సాహం కలిగించింది. ఏదేమైనా దేశరక్షణలో నావికాదళం కీలకపాత్ర వహించిందనే చెప్పొచ్చు. నేవీడే సందర్భంగా 'సాగరతీరంలో భారత నావికాదళం' గురించి ప్రత్యేకంగా వివరించారు. ఈ వ్యాసం ఆసక్తికరంగా ఉంది.

కర్రా వరప్రసాద్, యలమర్రు

స్ఫూర్తిదాయకం

మన అతిథి నాయుడమ్మ పరిచయం నేటి డాక్టర్లకు కొందరికైనా స్ఫూర్తిదాయకం. రావికొండల రావుగారి జ్ఞాపకాలు, అనుభవాలు ఇంకా చదవాలనిపిస్తున్నాయి. దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గారి త్యాగనిరతి, దేశభక్తి, నాయకత్వపటిమ నేటి వనితలు చదువుకోదగ్గవి.

బి. సూర్యారావు, విశాఖపట్నం- 18

రూ.510/- ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/- కే

హిందీ, తమిళం, కన్నడం మరియు మలయాళం స్పీకింగ్ ఇలా ఎన్నో కోర్సులు ఉచితం!

కోర్సుకి ఉపయోగపడే 4 ఉచిత పుస్తకాలు

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ.150/-కే

ఇవన్నీ!

4 కోర్స్ గిఫ్ట్ పుస్తకాలు ఫ్రీ
(5 ఇన్ 1 పాకెట్ సైజులో)

1. వర్డ్ పవర్ (ఆంగ్ల పదాల అద్భుత శక్తి)
2. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ (ఇంగ్లీష్‌లో ఉత్తరాలు వ్రాసే పద్ధతి)
3. వెర్బ్స్ డిక్షనరీ (క్రియలు - వాటి రూపాలు)
4. సినానిమ్ & యాంటొనిమ్స్ డిక్షనరీ (ఆంగ్ల సమాన పదాలు & వ్యతిరేక పదాలు)

Free 12 రోజుల్లో 12 భాషలు Free
(12 ఇన్ 1 పాకెట్ సైజులో)



1. హిందీ స్పీకింగ్ కోర్సు
2. తమిళ్ స్పీకింగ్ కోర్సు
3. కన్నడ స్పీకింగ్ కోర్సు
4. మలయాళం స్పీకింగ్ కోర్సు
5. బెంగాలీ స్పీకింగ్ కోర్సు
6. మరాఠీ స్పీకింగ్ కోర్సు
7. పంజాబీ స్పీకింగ్ కోర్సు
8. గుజరాతీ స్పీకింగ్ కోర్సు
9. అరబిక్ స్పీకింగ్ కోర్సు
10. ఉర్దూ స్పీకింగ్ కోర్సు
11. ఒరియా స్పీకింగ్ కోర్సు
12. సాన్‌స్క్రిట్ స్పీకింగ్ కోర్సు

(బొమ్మలో చూపిన ప్రకారం కాకుండా పాకెట్ సైజు పుస్తకాలే అని గమనించగలరు)

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది. -కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు. - వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు. ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను. - జె.శ్రీనివాసులు, తిరుపతి.

SINCE 1996

STUDENTS' ENGLISH INSTITUTE

New No. 203, Habibullah Road, T.Nagar, Chennai - 17.

3575

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు, 4 ఉచిత పుస్తకాలు మరియు 12 భాషల కోర్సులు ఇవన్నీ కలిపి కేవలం రూ.150/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

(మీ చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లో వ్రాయండి. లేనిచో కోర్సును పంపుటకు వీలుపడదు)

Name: ....

Address: ....

.... Pincode

టర్నింగ్ పాయింట్

దక్షిణాది రాష్ట్రాలకు, ధనం, సైన్యం అన్ని వనరులు ఎక్కువగా వున్నా లింకన్ సర్వాన్ని ఒడ్డి దీక్షతో పోరాడి అంతర్యుద్ధంలో గెలుపు సాధించాడు. బానిస విముక్తి చట్టాన్ని లింకన్ అమల్లోకి తెచ్చాడు. బానిసత్వం నిర్మూలింపబడింది.

వకుళాభరణం రామకృష్ణ

అబ్రహాం లింకన్ అధ్యక్షుడు కావడమే...

మానవులందరూ పుట్టుకతో సమానులు. పెద్దా, చిన్నా, తెలుపూ, నలుపూ, బీదా, ధనిక తేడాలుండవు. అందరూ స్వేచ్ఛగా, స్వతంత్రంగానే పుడతారు. హెచ్చు తగ్గులు ఆ తర్వాత వచ్చేవే ! అందుకే ప్రఖ్యాత తత్వవేత్త రూసో పుట్టాకే మనుషుల చుట్టూ సంకెళ్ళ పెనవేసుకొని, వారిని అస్వతంత్రులుగా చేస్తాయని అంటాడు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు (యుఎస్ఎ) చరిత్ర 500 సంవత్సరాలు. అంతకు ముందు అక్కడున్న ఆ దేశ వాసులు -రెడ్ ఇండియన్లు, ఇవ్వాళ చూద్దామంటే మచ్చుకైనా కనపడరు. వారి నాగరికతా, సంస్కృతులు మ్యూజియాల్లో దొరుకుతాయి. ఐరోపాఖండం నుండి, ముఖ్యంగా ఇంగ్లండ్‌లో నెలకొన్న మతవైష్యమాలను, మతపరమైన పీడనను తప్పించుకొని స్వేచ్ఛగా బతకడానికి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వెళ్ళన వారు, కొన్ని సంవత్సరాలకు మాతృభూమిపై తిరగబడి స్వాతంత్రం సంపాదించుకొన్నారు. ఆ స్వాతంత్ర్య ప్రకటనలో చారిత్రాత్మక సత్యాన్ని చాటి చెప్పారు. అదేమంటే పుట్టుకతో మానవులంతా సమానులు అని. అలా ప్రకటించిన అమెరికా తన వరకు వచ్చే సరికి లక్షలాది మందికి ఆ స్వేచ్ఛా స్వాతంత్రాలను హరించి, వారిని బానిసలుగా చేసింది. ఈ బానిసత్వ నిర్మూలన ఒకానొక చారిత్రక ఘటనతో సాధ్యమైంది.

నూతనంగా కనుగొన్న అమెరికా దేశం సువిశాలమైంది. నీరు, భూమి, గాలి చక్కటి వాతావరణం పుష్కలంగా ఉన్న ఒక ఖండం. సంపద ఉత్పత్తికి అన్నీ, అనువుగా వున్నా, ఉత్పత్తి చేయగల దైహిక శ్రమశక్తి లేదు. తెల్లజాతివారు సరిపడ సంఖ్యలో లేకపోవడమటుంచి, విస్తరిస్తున్న సువిశాల వ్యవసాయక్షేత్రాల్లో రాత్రీ పగలు కష్టించి పనిచేసే దేహదారుఢ్యం వారికి లేదు. ఆ పరిస్థితుల్లో, ఆఫ్రికా ఖండ తీరాన్నుండి (దాన్ని బానిస తీరం అన్నారు) వేల నుండి లక్షలదాకా, నల్లజాతి వారిని (నీగ్రోలు) పట్టుకొని, గొలుసుల్లో బంధించి అరలు అమర్చిన ఓడలో, ఐదున్నర అడుగుల పొడవు, 16 అంగుళాల వెడల్పు బెర్తులో ఉంచి నెలల పాటు అట్లాంటిక్ సముద్రం మీదుగా, అమెరికా తూర్పు తీరానికి కొనిపోయేవారు. బహిరంగంగా వేలం వేసి అమ్మేవాళ్ళు. వీళ్ళకు ప్రాథమిక హక్కులు కాదు కదా, సరైన తిండి లేదు. పశువులను కట్టి పడేసినట్లు చేసి, కాయకష్టం చేయించుకొని వారి, చెమటతో తడిసి పండిన ధనధాన్యాలను కొల్లగొట్టేవాళ్ళు. ముఖ్యంగా అమెరికాలోని దక్షిణాది రాష్ట్రాల్లో బానిసత్వం ఎక్కువ. అక్కడ సువిశాల వ్యవసాయ క్షేత్రాలు, వేల ఎకరాల్లో ఉండేవి. ఉత్తరాది రాష్ట్రాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెంది, బానిస శ్రమశక్తితో అంతగా అవసరముండేదికాదు. అందువల్ల, ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య ఆర్థికపరమైన, రాజకీయ పరమైన విభేదాలు తలెత్తాయి. ఒక విధంగా ఉత్తరాది రాష్ట్రాలు బానిసత్వానికి వ్యతిరేకమనే



అభిప్రాయం ఏర్పడింది. సరిగ్గా ఈ తరుణంలో, అబ్రహాం లింకన్ అమెరికాకు 16వ అధ్యక్షుడుగా 1860లో ఎన్నికయ్యాడు. లింకన్ ఎన్నిక దక్షిణాది రాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించింది. నిజానికి లింకన్ బానిసత్వ నిర్మూలనాకారుడు కాదు. కానీ, బానిసత్వానికి వ్యతిరేకి. స్వేచ్ఛా, స్వాతంత్రాలు కావాలనే మనీషి. ఎక్కడైతే బానిసత్వం అమల్లో ఉందో, అయా రాష్ట్రాల్లో జోక్యం చేసుకోనన్నాడు. బానిసత్వం లేని రాష్ట్రాలకు, కొత్తగా వ్యాపింపచేయడానికి, దాన్ని చట్టబద్ధం చేయడానికి వ్యతిరేకినని స్పష్టంగా ప్రకటించాడు. దక్షిణాది రాష్ట్రాలు దీంతో సంతృప్తి చెందక, అమెరికన్ యూనియన్ నుండి, విడిపోయి వేరే దేశంగా ఏర్పడాలన్న ఉద్దేశ్యంతో విడిపోనారంభించాయి. దేశ ఐక్యత ఉనికి దీంతో దెబ్బతిననారంభించింది. ఐక్యత దెబ్బతినడానికి లింకన్ ససేమిరా ఒప్పుకోనన్నాడు. దేశ ఐక్యతను ఎలాగైనా కాపాడ్డానికి శపథం చేశాడు.

అంతర్యుద్ధం మొదలైంది. 1861 నుండి నాలుగు సంవత్సరాల పాటు, దక్షిణ కీకారణ్యాల మధ్య భీకర యుద్ధం జరిగింది. అంతర్యుద్ధం నాటికి అమెరికాలో 40 లక్షల మంది నల్లజాతి బానిసలున్నారు (1770లో వారి సంఖ్య 7 లక్షలు మాత్రమే) దక్షిణాది రాష్ట్రాలకు, ధనం, సైన్యం అన్ని వనరులు ఎక్కువగా వున్నా లింకన్ సర్వాన్ని ఒడ్డి దీక్షతో పోరాడి అంతర్యుద్ధంలో గెలుపు సాధించాడు. బానిస విముక్తి చట్టాన్ని లింకన్ అమల్లోకి తెచ్చాడు. బానిసత్వం నిర్మూలింపబడింది. అంతర్యుద్ధం 1865లో అంతం కావడం, ఆ తర్వాత లింకన్ రెండోసారి అధ్యక్షుడిగా గెలిచారు. ఆ తర్వాత కొద్ది వారాల్లోనే, ఒక థియేటర్ నాటకం చూస్తుండగా, జాన్ విల్క్స్ బూత్ అనే దుండగుడు లింకన్‌ను కాల్చి చంపాడు.

అబ్రహం లింకన్ అమెరికా, సంయుక్త రాష్ట్రాల అధ్యక్షులలో అగ్రగణ్యుడు. అతి పేద కుటుంబంలో, కొయ్య దుంగలతో, నిర్మించిన ఒకే ఒక గది ఉన్న ఇంట్లో జన్మించి, స్వయం కృషితో పెరిగి, పెద్దవాడయ్యాడు. మంచి వక్త, అంతర్యుద్ధకాలంలో యూనియన్ సైన్యాలను తన వాగ్ధాటితో ఉత్తేజితులను చేసేవాడు. ప్రజాస్వామ్యానికి లింకన్ చెప్పిన నిర్వచనం, సార్థకంగా నిలిచిపోయింది. ✻



సలహాలు

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

నాకు అర్హతుందా?

25.4.1980 తేదీన నేను భూమి కొన్నాను. ఆ భూమి తాలూకు కామందుకు పూర్తి క్రయధనం ఆరోజే చెల్లించాను. అదే రోజున అతను స్వాధీన అగ్రిమెంటు రాసి, నాకు ఇచ్చాడు. నేను వెంటనే భూమి స్వాధీనం చేసుకున్నాను. ఒక సంవత్సరం గడిచింది. ఈ మధ్యకాలంలో సదరు స్థలంలో నేను ఆర్.సి.సి బిల్డింగు నిర్మించుకున్నాను. అప్పటి నుండి పంచాయితీ పన్నులు చెల్లిస్తున్నాను. ఎప్పుడూ క్రమం తప్పలేదు. ప్రస్తుతం ఈ స్థిరాస్థిని నేను విక్రయించదలచాను. ఎవరైనా కొనుక్కోవడానికి ముందుకొస్తారా? ఒక వేళ వస్తే వారికి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి కదా. అందుకు భూమి నా పేరు మీదే ఉండాలి. కానీ అలా లేదు. ఇప్పుడు ఆ భూమిని అమ్మేందుకు, కొనుగోలు చేసిన వారి పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు నాకు అర్హతుందా? ఎవరినుంచైనా వ్యతిరేకత ఎదురయ్యే అవకాలున్నాయా? తెలుపగలరు.

పి. వెంకటరెడ్డి,
సింగరాయకొండ, ప్రకాశం జిల్లా.

మీ ఆస్థి సర్వం మీ అధీనంలో ఉందని చెబుతున్నారు. అదే నిజమైతే మీకు రిజిస్ట్రేషన్ చేసే అవకాశముండేది. మీరు చెబతున్న దాని ప్రకారం చూస్తే... భూకామందు ఆ ఆస్థిని మీ పేరిట రిజిస్ట్రేషన్ చేయలేదని తెలుస్తోంది. ప్రస్తుతం మీరు ఈ ఆస్థిని అమ్మదలిస్తే... కొనుగోలు దారుని పేరిట కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేయాలి. దీనికి మీకు ఎటువంటి అర్హతా లేదు. ఒరిజినల్ ఓనర్‌తో చేయించాల్సుంటుంది. ఆయన చేయడానికి ఒప్పుకోక పోతే కోర్టు ద్వారా ఆ ఆస్థిని మీ పేరు మీద మార్చుకోండి. ఆ తర్వాత అమ్ముకోవడానికి అవకాశముంది.

గడువు దాటితే...

నేను ఒక ప్రభుత్వోద్యోగికి 50వేలు అప్పుగా ఇచ్చి ప్రోనోటు రాయించుకున్నాను. ఆ ప్రోనోటుకు మూడు సంవత్సరాల గడువు సమీపిస్తోంది. డబ్బులివ్వాలని అతన్నడిగాను. ఇప్పుడు లేవు ఆరునెలల తర్వాత ఇస్తానన్నాడు. ప్రోనోటుకు చెల్లు రాసివ్వమని అడిగాను. ఇంటికొచ్చి రాసిస్తానన్నాడు. అతని కోసం ఎదురు చూశాను. రాలేదు. గడువు మూడు రోజులుండగా అతని కోసం వెళ్లాను. సెలవు పెట్టి బెంగుళూరు వెళ్లాడని తెలిసింది. ఇక గడువులోపల స్టాంప్ డ్యూటీ, లాయర్ ఫీజు ఇచ్చి దావా వేయడానికి ప్రయత్నించాను. డబ్బులు దొరకనందున కేసు వేయలేక పోయాను. తిరిగి అతను వచ్చిన తరువాత డబ్బులు అడిగితే 'నేను ఇవ్వలేను దావా వేసుకో' అని చెబుతున్నాడు. ఇప్పుడు నేనేం చేయాలి ! నేను నష్ట పోవలసిందేనా? హై కోర్టు నుండి పర్మిషన్ తెచ్చుకొని దావా వేసే అవకాశముందా? నాకేదైనా దారుందా ? దయచేసి తెలుపగలరు.

కె.సుబ్రహ్మణ్యం, కోవూరు

సివిల్ దావా ఏరకమయినదైనా లిమిటేషన్ చట్ట ప్రకారం మూడు సంవత్సరాల లోపు మాత్రమే వేయవలసి ఉంటుంది. అతను మీకు గడువు పూర్తి అయ్యేలోపు మళ్లీ చెల్లు రాసి ఉంటే ఆ తేదీ నుండి మూడు సంవత్సరాలు వర్తించేది. మూడు సంవత్సరాలు దాటాయి. ఇప్పుడు ఏ కోర్టూ మీకు సకాలంలో తీర్పు చెప్పదు. ఇట్టి విషయంలో హై కోర్టు ఏమీ చేయదు. గడువులోపల కనీసం ఒక్క రూపాయి స్టాంప్ డ్యూటీగా కట్టి కోర్టులో వేసి, అది పరిశీలన సమయంలో మీరు మిగతా స్టాంప్ డ్యూటీ కట్టి ఉండాల్సింది. అప్పడే మీరు సమయంలోపల దాఖలు చేసినవారవుతారు.

భూరి విరాళం

ఓ ఊళ్లో స్విమ్మింగ్ పూల్ కట్టాలనుకున్నారు కొందరు

పిసినారి పాపయ్యను చందా అడిగారు

"నా వంతు చందా" అంటూ పాపయ్య బకెట్ నీళ్ళు తెచ్చిచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

ఇంటి సంగతులు

అవి తీపి గురుతులే మరి!

రుక్మిణి

"పొటిగరాపుల కరీదు ఎంటనే ఇప్పించేయమన్నారండీ. ఏడాది కిందట మీరూ సాన్దీ కలిసి తీసుకున్న పొటిగరాపుల కరీదును మా పంతులు నిలబెట్టి పుచ్చుకోమన్నారు"

కన్యాశుల్కం నాటకంలో బొంకుల దిబ్బ సన్నివేశంలో బంట్రోతు గిరీశాన్ని నిలబెట్టి, దబాయించిమరీ అడుగుతున్న మాటలు. కంగారుపడకండి... 'పొటిగరాపులు' అంటే "ఫోటోగ్రాఫులు" అని అర్థంలెండి!. 'పొటిగరాపు'లంటే ఆనాట్నించీ చాలా మందికి వెర్రివ్యామోహం.

"భామా.... ఊర్కో ఆ ఫోటోల పెట్టె తీయకే అంటే వింటావా... మూతపెట్టేయ్... లే..! ఎప్పుడో తీరిక చూసుకుని తెరిచిచూస్తావ్... ఆవేదన చెందుతావు. రోజూ కనబడితే అంత బాధ ఉండకపోయేది కదా" మావారు ఆప్యాయంగా అనునయిస్తున్నారు. మా పిల్లలకిదేం అర్థంకాక బిక్కమొహమేశారు.

ఓ రోజు...

మా పెళ్లి ఫోటోలు తిరగేస్తూ కూర్చున్నాను. మా చింటూ గాడు మొహం చిట్లించుకుని, 'నేనెందుకు ఆ ఫోటోల్లో పడలేదు. నన్నెందుకు అప్పుడు ఫోటో తీయలేదు" అని నానా అల్లరీ చేస్తున్నాడు. నాకు నవ్వాగింది కాదు. ఆ రోజు వాడు తెగ బతిమాలించుకుని గానీ అన్నం తినలేదు.

జ్ఞాపకాలు... స్మృతులు... చేదులో తీపి...

ఇళ్లల్లో పెళ్లి చూపులు, పెళ్లి... బారసాల...పుట్టినరోజులు ఇలా ఏరకమైన పంక్షన్లకైనా... ప్రత్యేకించి నలుగురూ చేరే సందర్భం వస్తే చాలు చాలు వెంటనే ఫోటోగ్రాఫరుకు కబురెళుతుంది. చావులకు సరేసరి!

వీడియోయుగం వచ్చిపడ్డాక అంతా సీడీల్లో బంధించేయడమొక మార్పు. వాటిని చూసుకోవాలంటే పెద్ద తంతు. టీవీ, కంప్యూటర్‌ల హంగామాకు కరెంటుండాలి. అందుకే... పాత తరపు ఫోటోగ్రాఫులే బెటరు. బాగా నలిగిపోయినా గంటలకొద్దీ చూస్తూ... కాలాన్ని వెనక్కి తిప్పొచ్చు. గుండెల్లో గూడు కట్టుకున్న ఉద్వేగాన్నీ, అలలపోట్లతో అలజడి చేస్తున్న త్యాగాలనూ మననం చేసుకుంటూ గడిపేయొచ్చు. అప్పుడు నవ్వు రావొచ్చు, చిరుదరహాసం... పెల్లుబికితే కన్నీరు వరదలు కట్టొచ్చు.

కాలేజీ చదువైపోయిన తర్వాత ఓసారి మా ఫైనలియరు గ్రూపు ఫోటోను తీసి చూసుకుంటున్నా. ఆనాటి నా అవతారాన్ని, మిత్రుల మొహాలను చూస్తూ... ఉద్వేగంతో రెచ్చిపోయాను. వాళ్ల గురించి మా వారితో గబగబా వాగేస్తున్నాను.

"స్టెల్లా పక్కన నువ్వేనా... చప్పిడిముక్కు... అరెరె పీర్ల కత్తిలా ఎలా ఉందో... ఒరే మీ అమ్మ ఫోటో చూడండ్రా... పీలగా గాలికి ఎగిరిపోయేలా లేదూ... వార్నీ అబ్బెబ్బే...!" మావారు ఆట పట్టిస్తున్నారు. మా చింటుగాడు, అమ్మాయి బబ్బి "హే... హే..." అని కేరింతలు కొడుతున్నారు. చప్పట్లు చరుస్తున్నారు. నాకు ఒళ్లుమండిపోయింది. ఉక్రోషం!

వెంటనే నేను ఆ అట్టపెట్టె అడుగునుండి పాత... బాగా వెలిసిపోయిన ఫోటో ఒకటి తీశాను. కార్డు సైజుది. అందులో అయిదేళ్ల బాబు... పూర్తిగా బట్టల్లేకుండా స్నానానికి సిద్ధమైపోతున్నట్లుగా... చేతిలో చెంబు పట్టుకుని ఉన్నాడన్న మాట.

"ఒరే... ఇదెవరో... కనిపెట్టండి... జాగ్రత్తగా చూసి చెప్పండి. మీ డాడీ...!" అంటూ నేను గట్టిగా నవ్వాను. నా కవ్వింపు దెబ్బకు మా వారి మొహం ఎర్రబారింది.

"చాలు సంబడం... అట్లాంటివా పిల్లలకు చూపించేది?" అని చటుక్కున నా చేతిలోంచి ఆ ఫోటోను గుంజుకున్నాడు. మా పిల్లలు ఒకటే నవ్వులు. మా వారి మొహంలో చిన్నపిల్లాడి చిలిపితనం. తర్వాత అట్టపెట్టెలోని కొన్ని ఫోటోలను తీసి చూసుకుంటుంటే... గుండె బరువెక్కింది. పోయిన మా మేనత్త... ఎపుడూ గలగలా నవ్వుతూ మాట్లాడేవారు. ఇప్పుడు లేరు. నా కనుకొలుకుల్లో నీరు చేరింది.

వాటిని కలకాలం పదిలపరుచుకుంటే... జీవితానికో అర్థం... మనస్సుకు కాస్తంత ఉపశమనం. కలలూ, జ్ఞాపకాలూ తీపిగానే ఉంటాయి కదా! అందుకే అట్లాంటి ఫోటోలను అలా అట్టపెట్టెలో విసిరిపారేయకుండా... ఫోటో ఆల్బంలో అతికించుకోవాలి. అప్పుడే వాటికి బూజుపట్టదు. అవి వెలసిపోవు. ఖరాబు కావు.

కొన్ని సందర్భాలను విడదీసి... అంటే... పెళ్లి చూపులు, ఫంక్షన్లూ, బంధువుల, దగ్గర స్నేహితులు, ఇలా విడివిడిగానూ ఆల్బములను తయారు చేసుకోవచ్చు. కాస్తంత శ్రద్ధా, ఒకింత ఓపికా పెట్టుబడి పెట్టాలి. అంతేమరి!

ఇంకాస్త ఓపికుంటే... గట్టి పేపరు షీట్లు రంగుల్లో దొరుకుతాయి. వాటిని చక్కగా ఓ క్రమంలో ఫెవికాల్‌తో అతికించి ఫ్రేములు కట్టించుకోవచ్చు. హాల్లో బిగించుకుంటే అందంగా కనిపిస్తాయి.



పరిచయస్తులు, స్నేహితులు ఇంటికి వచ్చినప్పుడు ఆల్బమ్‌లు వాళ్లముందుంచితే వాటిని చూస్తూ కాస్సేపు రిలాక్సవుతారు. ఈ లోపు వారికేమన్నా చేసిపెట్టే వీలు మీకూ కలుగుతుంది.

✻

నేర్చుకుందాం...రా!

సండే డెస్క్

మీరూ వేయగలరు!



ట్రేసింగ్ వీల్‌పద్ధతి

"శాంతీ! ఇవన్నీ నువ్వు ఒక్కపూటలోనే వేశావా? ఎంత చక్కగా ఉన్నాయో... అచ్చు గుద్దినట్టు మాన్యువల్‌లో లాగానే అనిపిస్తున్నాయే..." అంటోంది మాలతి తన కూతురు వేసిన బొమ్మల వంకే చూస్తూ.

"అక్కా... బొమ్మలేయడం నీకింతబాగా వచ్చు కాబట్టే నువ్వు సైన్సు గ్రూపు తీసుకున్నావు కదూ?" అంటోంది సౌమ్య.

"మీరూ ఇలాగే వేయగలరు. ముఖ్యంగా నేను చెప్పబోయే పద్ధతిలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్ డిజైన్లు వేస్తే.... మీక్కూడా చక్కగా వస్తాయి" అంటూ శాంతి చెప్పడం ప్రారంభించింది. వారిరువురూ శ్రద్ధగా ఆమె మాటలనే వింటున్నారు.

ఆ పద్ధతేంటో మాకూ తెలిస్తే బాగుండు... ఆ డిజైన్లు వేయడానికి ఇన్ని రోజులు శ్రమ పడక్కర్లేదు. అనుకుంటున్నారా?

ఇదే గ్లాస్ లైట్ టెక్నిక్. పారదర్శకంగా ఉన్న ఒక అద్దాన్ని రెండు చెక్కల మధ్య ఉంచండి. ఈ గ్లాస్ కింద కరెంట్ బల్బును బిగించండి. ఇప్పుడు మీరు ట్రాన్స్‌ఫర్ చేయదలచుకున్న పేపరును గ్లాస్ మీద ఉంచండి. ఆ పేపరు మీద మీరు ఎంబ్రాయిడరీ చేయదలుచుకున్న బట్టను ఉంచండి. ఇప్పుడు మీకు పేపర్ మీద ఉన్న డిజైన్ స్పష్టంగా కనిపిస్తుంది. దీనికి కారణం అద్దం కింద ఉన్న కాంతి. ఈ టెక్నిక్ పనిచేయాలంటే ఎంబ్రాయిడరీ చేయాల్సిన బట్ట పలుచగా ఉండాలి. ఒకవేళ బట్ట మందంగా ఉన్నట్లయితే ఈ గ్లాస్, లైట్ టెక్నిక్ పని చేయదు.



ట్రేసింగ్ వీల్ పద్ధతి

డిజైన్ చేయదలచుకున్న పేపరును బట్ట మీద ఉంచండి. ట్రేసింగ్ వీల్‌ని ఉపయోగించి డిజైన్ లైన్ డ్రా చేయండి. ఎంబ్రాయిడరీ చేయాల్సిన బట్ట మీద సన్నటి చుక్కలు, చిల్లులతో కూడిన డిజైను ఒక క్రమంలో ఏర్పడుతుంది. అలా ఏర్పడిన చిల్లులను పెన్సిలుతో కలపండి.

స్టిచ్చింగ్ పద్ధతి

డిజైన్ పేపరును బట్ట మీద ఉంచి నాలుగు వైపులా గట్టిగా బిగించండి. ఈ డిజైన్ లైన్లను సూదితో అల్లండి. కట్టు దూరంగా పడేట్లు జాగ్రత్త వహించండి. ఈ పని వెంటనే జరగడం కోసం కుట్టుమిషన్ ఉపయోగించొచ్చు. లైట్ కలర్ బట్టకు డార్క్ కలర్ దారం, డార్క్ కలర్ బట్టకు లైట్ కలర్ దారం వాడాలన్న విషయాన్ని మరచిపోకండి.

మీరు మిషన్ ఎంబ్రాయిడరీ మొదలు పెడుతున్నారా?

ఒక వేళ మీరు మిషన్ ఎంబ్రాయిడరీ మొదలు పెడుతున్నట్లయితే మిషన్ లోపలనుంచిగానీ, ఇతరత్రాగానీ క్లాత్‌కి తగలకుండా చూసుకోండి. ఎంబ్రాయిడరీ పనిని వీలయినంతవరకూ పగటిపూటే చేయండి. పగటి పూట కంటికి శ్రమ తక్కువగా ఉంటుంది. ఎంబ్రాయిడరీ రంగు వెలసిపోతోందా? నూలు తెగిపోతోందా? నూలు దారాలను ఎంబ్రాయిడరీకి ఉపయోగించడమే దీనికి సరైన పరిష్కారం. బ్యాగ్స్, పిల్లోకవర్స్, టేబుల్‌క్లాత్స్ మీద ఎంబ్రాయిడరీ చేసేప్పుడు లైనింగ్ క్లాత్ వాడుకోవచ్చు. దీని వల్ల వీటికి మరింత మన్నిక కలుగుతుంది.

తగిన సూదులు...

కొమ్మలు, స్ట్రెయిట్ కుట్లుకు అనుకూలమైనది లాంగ్ ఐ నీడిల్‌గా పిలవబడే సన్నటి మొనతో వుండే పెద్ద కన్ను సూది.

ఫ్రెంచ్ ముడి, బులియన్ ముడులకు సన్నటి మొనతో ఉండే చిన్న సూది అనుకూలమైనది. ఇక వెడల్పు కన్ను ఉండే సూది ఉన్ని ఎంబ్రాయిడరీకి, ఓపెన్ వర్క్ ఎంబ్రాయిడరీకి, క్రాస్ కుట్టుకు అనుకూలం.

*

సీరియల్

మాధవి

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

గతవారం కథలో...

యయాతి మహారాజు కూతురైన మాధవికి చెప్పరాని దుస్థితి దాపురించింది. దానం పేరిట గాలవుడికి, గుర్రాలకు మారకంగా ఇద్దరు రాజుల పాలిటపడి బిడ్డల్ని కూడా పోగొట్టుకుంది. ఇప్పుడీ ఉశీనరుడి రాజ్యంలో మహారాణి పిల్లలకు విషం పెట్టిందనే నిందకు గురయ్యింది. పిచ్చదయ్యిందనే పుకారు వ్యాపించింది. మాధవినందరూ పిచ్చిపట్టినదానిలా చూస్తున్నారు.

(24వ భాగం)

'పిచ్చిదాన్లా అరుస్తోంది' అంటూ ఛీత్కారంగా మాట్లాడిన మహారాణి మాటలకు హృదయం రగిలిపోయింది మాధవికి. అనవసరంగా తనమీద నిందలేస్తూ తననూ, కడుపులోని బిడ్డనూ చావమంటోన్న ఆమె శాపనార్థాలకు కోపం బుస్సున పొంగుకొచ్చింది.

"అవును నాకు పిచ్చే... లేకపోతే నీ పిల్లల్నెందుకు ముద్దుచేస్తాను? వాళ్ళలో నా పిల్లల్నెందుకు చూసుకుంటాను? ప్రేమగా నిమిరితే మట్టుకు పాము కాటేయకేం చేస్తుంది? ఎంత ఆదరంగా 'అక్కా' అని పిలిచినా నువ్వు దాన్ని దక్కించుకోవు. నేనేం ఆయనగార్ని కోరి వరించలేదు, నా ఖర్మకాలి ఇలా రావల్సివచ్చింది. ఇప్పుడు మళ్ళీ మహిమను చేసుకున్నారు రాజుగారు. అయినా ఏం చేయగలిగావు? ఆవిడ మీద చూపు నీ కోపాన్ని" అంటూ నరాలు చిట్లేలా అరిచింది.

కళ్ళలో రక్తం చిమ్ముతోంది. ఆవేశంతో గొంతు వణికింది. భరించశక్యంకాని ఆవేదనతో కన్నీళ్ళు తన్నుకొచ్చాయి. కనిపించని దేవుణ్ణి తల్చుకుని కుళ్ళికుళ్ళి ఏడ్చింది. కాసేపటికి నిజంగానే మతి భ్రమించినట్లయి లోపల అనుకోవాల్సినవన్నీ పైకే అనసాగింది.

'ఎందుకు నన్నిలా చేశావు? నా జీవితంమీద నాకు విరక్తి వస్తోంది. నాకు బ్రతకాలనిలేదు. చచ్చే ధైర్యమూ లేదు. నేనేం చేయాలి?!' అంటూ జుట్టు పీక్కుంటూ పెద్దపెట్టున రోదించసాగింది.

అప్పటికే మూగిన దాసీజనం ఎవరికి తోచింది వారు మాట్లాడుకోసాగారు.

అది చూసిన మాధవికి ఒళ్ళు మండిపోయి "మీకేం పనీపాటా లేదా? వెళ్ళండవతలికి... ఇక్కడే వుంటే ఏం చేస్తానో నాకే తెలీదు" అంటూ గుడ్లురిమింది.

"అమ్మో, ఈవిడకి నిజంగానే పిచ్చెక్కినట్లుంది, ఏ రాయోవేసి కొట్టిందంటే ఛస్తాం" అని ఒక దాసి గొణిగినట్లు చెప్పగా అందరూ అక్కణ్ణించి పలాయనం చిత్తగించారు.

ఎంతకాలంగానో అణచుకున్న బాధతో గుండె అగ్నిపర్వతంలా వుండి ఇప్పుడు బద్దలైంది. 'పుట్టానే తల్లిప్రేమకు దూరమైంది. ఉన్నాడన్నమాటే గానీ తండ్రి ఎన్నడూ దరికితీయలేదు. యుక్తవయసులో స్వయంవరానికీ నోచుకోలేదు. ఎవడో ఒక పిలకబ్రాహ్మణ్ణి అనుసరిస్తూ వేశ్యకంటే హీనంగా జీవితం సాగిస్తోంది. పుట్టినబిడ్డను పక్షులు కూడా ప్రేమగా సాకుతాయి కానీ తనకా అదృష్టం కూడా లేదు. ఈ నికృష్టజీవితం ఎన్నిసార్లు పునరావృతం అవుతుంది?' అని గొణుక్కోసాగింది. కాసేపటికి రాణీమీద గొప్ప అనుమానం బయల్దేరింది. ఆమెకి చంపే ఉద్దేశం వుండబట్టే తననూ ఆ దృష్టితో చూసింది. అంటే తనకు పుట్టబోయే బిడ్డను చంపాలనుకుంటోంది కాబోలు. 'అమ్మో, నా బిడ్డను చంపితే నేనేం కావాలి? అందుకే ఏమీ తినకుండా జాగ్రత్తగా వుండాలి... లేకపోతే తినేదాంట్లో ఏమైనా విషం కలిపితే ఎలా?' అని భయంభయంగా పొట్టను తడుముకుంది.

కులాసాగా ఉద్యానవనంలో తిరుగుతోన్న మహిమకు మహారాణి కనిపించి, 'మాధవికి పిచ్చిపట్టింది' అని చెప్పడంతో సంతోషంపట్టలేక చూద్దామని ఇటుగా వచ్చింది.

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

విన్న మాటల్నిబట్టి ఆమెని మహిమగా మాధవి త్వరగానే గుర్తించింది. అందం ప్రస్తావన వచ్చినపుడు రాజు మాధవి సౌందర్యాన్ని పొగిడాడు. అప్పట్నుండీ పరోక్షంగా ఆమెని ద్వేషిస్తోంది మహిమ. 'చూడబోతే ముఖంలో కళలేదు. ముందుకు పొడుచుకొచ్చిన పొట్టతప్ప ఇంకేముంది ఈమెలో?' అనుకుని వ్యంగ్యంగా నవ్వుకుంటూ "గొప్ప అందగత్తెనని విర్రవీగేదానివి కాబోలు, చివరికి ఏం గతి పట్టిందే నీకు?!" అంది ఛీత్కారంగా.

ఆ హేళనకు కోపమొచ్చిన మాధవి "నిన్నెవరు రమ్మన్నారిక్కడికి, అనవసరంగా కోపం తెప్పించకు" అంది.

"నువ్వు పిలిస్తే రావడానికి ఇది నీ సొమ్మనుకుంటున్నావా? నీదో వేశ్యబ్రతుకు, నీ మొహానికి కోపమొకటా? లేకపోతే సంవత్సరంపాటు కాపురమేంటి, వినడానికే రోతగా వుంది" అంది మహిమ ముఖమంతా వికారంగాపెట్టి.

"నోర్మూసుకో, ఇంకేం మాట్లాడకు" అంది మాధవి గొంతు వణుకుతుండగా.

"ఇలా బ్రతికేకంటే చావరాదూ?!" అనేసి చివాలున వెళ్ళిపోయింది మహిమ.

'అవును, అదే మేలు.. ఛస్తే పీడాపోతుంది.. అయినా, నేనెందుకు చావాలి? చస్తే లోపలున్న పాపాయేమౌతుంది? శిశుహత్యకంటే పాపం ఇంకేముంటుంది? వీళ్ళంతా నా బిడ్డని చంపడంకోసమే ఎత్తుగడ వేస్తున్నట్లున్నారు, అవేం సాగనివ్వను' అని గొణుక్కోసాగింది మాధవి.

మహారాణి చెప్పగా విని అలికిడి లేకుండా వచ్చిన రాజు మాధవి తనలో తాను మాట్లాడుకోవడం చూసి చిత్తరువులా నిలబడ్డాడు. 'అందరిలా తనను గౌరవిస్తూ కనుసన్నల్లో మెలిగే ప్రయత్నం చేయనందుకు అందగత్తెనన్న అహంకారం కాబోలని కోపమొచ్చింది కొన్నిసార్లు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్లు ఏడుపుగొట్టు ముఖం పెట్టుందని విసుగేసిందీమధ్య. ఇప్పుడు చూస్తే ఈమెకి నిజంగానే పిచ్చిపట్టినట్లుంది' అనుకుని జాలిపడ్డాడు.

దగ్గరికొచ్చి భుజంమీద చెయ్యేసి ఓదార్చబోతే విసురుగా చేతిని లాగేసి "ఈ పిచ్చిదాన్నిలా వదిలేసి వెళ్ళండి" అంది మాధవి కోపంగా.

అంతకుముందెన్నడూ ఆమె అలా ప్రవర్తించలేదు. ఇతర సంగతులలా వదిలేసి రాజునన్న భయం కూడా లేదంటే 'పిచ్చి బాగా ముదిరినట్లే వుంది' అనుకుని "ఎవరక్కడ?.. రాజవైద్యుణ్ణి వెంటనే పిలిపించండి" అన్నాడు రాజు హెచ్చుస్వరంతో.

మాధవి పొట్టను తడుముకుంటూ "ఎందుకమ్మా నాకింత బాధ, నేను భరించలేకపోతున్నాను... ఎవరికి చెప్పుకోను? నన్నెవరు ఓదారుస్తారు? నామీదెవరికి ప్రేముంది? అవ్వా, నేత్రా ఎలా వున్నారు? నాకు మిమ్మల్ని చూడాలనిపిస్తోంది, మీ ఒళ్ళో తల పెట్టుకుని ఏడ్వాలనిపిస్తోంది" అంటూ కళ్ళు మూసుకుని గోడకు చేరబడి ఏడవసాగింది.

రాజు రెండునిమిషాలు చూసి 'ఈ తల్నొప్పిని అనవసరంగా కొనితెచ్చుకున్నాను' అనుకుని విసుగ్గా వెళ్ళిపోయాడు. రాజవైద్యుడు మాధవిని పరీక్షించి 'ఉన్మత్తావస్థ'లో వుందనిచెప్పి ఏవో చూర్ణాలిచ్చి ఆదమరచి నిద్రపోయేలా చేశాడు. ఆమె మందురూపంలో అయితే వేసుకోనని మొరాయించే అవకాశముందని ఊహించి పానీయం లేదా పదార్థంలో కలిపివ్వమన్నాడు వైద్యుడు. ఆ తర్వాతెప్పుడు మాధవి అలా తనలోతాను మాట్లాడుకోలేదు, ఎవరిపైనా ఆగ్రహించలేదు. కానీ కళ్ళలో నైరాశ్యం గూడుకట్టుకుంది.

వృద్ధదాసికి మాధవిమీద సానుభూతి కలిగింది. తక్కినవాళ్ళంతా మొక్కుబడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు కానీ ఆవిడమాత్రం ప్రేమగా మాట్లాడిస్తుంది. సైనికులుగా వెళ్ళిన కొడుకులు చనిపోవడంతో దుఃఖమంటే ఏమిటో మరీ

అద్భుతమైన తెలుగు తనంతో అలరారిన తెలంగాణా గ్రామసీమల కుటుంబ కథా నేపథ్యంతో మరో సీరియల్ ప్రారంభం త్వరలో...



తెలిసొచ్చింది. మహిమ అవమానించిన విషయమొక్కటే ఆవిడకి తెలుసు, అందుకే బాధపడుతోందనుకుని "దాని బాబు అనవసరంగా కయ్యానికి కాలు దువ్వకపోతే అసలు యుద్ధమే జరిగేది కాదు. ఆ యుద్ధంలోనే నా కొడుకులిద్దరూ చనిపోయారు. తండ్రి పొగరే దానికీ వచ్చినట్లుందమ్మా... అందులో బాగా సొరె తెచ్చిందిగా, ఆ అహంకారమూ వుంది" అంది స్వరం తగ్గించి, మెటికలు విరుస్తూ.

మాధవి ఏమీ బదులివ్వకపోవడంతో "మనోవ్యాధికి మందే లేదంటారు, నువ్విలా బాధపడి ఆరోగ్యం చెడగొట్టుకోకు... అది కడుపులో వున్న బిడ్డకు అస్సలు మంచిది కాదు. అయినా నా కడుపుశోకంకంటే బాధపడాల్సిన విషయమా... నువ్వే చెప్పు" అంది వృద్ధదాసి.

"నాదీ కడుపుశోకమేనమ్మా" అని ఆవిణ్ణి కావిలించుకుంది.

వృద్ధదాసి అయోమయంగా చూసి 'పాపం, మందు పూర్తిగా పనిచేసినట్లులేదు' అనుకుని కాస్త కునుకు తీసేందుకు వసారాలోకి వెళ్ళింది.

మాధవి కణతలు నొక్కుకుంది. తనకిక మంచిరోజులు లేవనే నిర్ణయానికొచ్చింది. 'ఈసారైనా పుట్టే శిశువును తనతోనే వుంచుకోవాలని తానేదో పిచ్చికలలు కంటోంది కానీ అది జరిగేపని కాదు. ఎప్పట్లాగే బిడ్డను అప్పగించి మరో రాజుతో వుండేందుకు ఆ తుచ్ఛుడివెంట అడవుల్లోపడి పోవాలి. గుర్రాలన్నీ దొరికేదాకా ఇలాగే చేసి, చివరికి తనతోనే వుండమంటాడు కాబోలు... తానింత దిగజారడానికి కారణమైన గాలవుడిని తల్చుకుంటేనే జుగుప్స కలుగుతోంది. ఎవర్నీ నిందించి ఏం లాభం, తన బ్రతుకులో సుఖమూ శాంతీ లేవని అర్థమైపోయింది. ఎన్నాళ్ళిలా? అసలెందుకు బ్రతకాలి? నాకు జీవించాలని లేదు. ఇంకోసారి బిడ్డను పోగొట్టుకోలేను. అంతకంటే కనకుండానే చనిపోవడం మంచిది' అనుకుంది.

వెంటనే లేచి ఓ పక్కగా వున్న బావిలో దూకింది. కొద్దిదూరంలో మొక్కలకు నీళ్ళు పోస్తున్న దాసి అది గమనించి కేకలుపెట్టడంతో భటులతో సహా చాలామంది గుమికూడారు. ఓ భటుడు గబుక్కున బావిలో దూకి మాధవిని రక్షించాడు.

కొద్దిసేపటికి రాజు, రాణీవాసపు స్త్రీలందరూ కూడా పోగయ్యారు.

'నయం చచ్చింది కాదు, జీవితాంతం ఈ బావిని చూసి భయపడాల్సొచ్చేది' అని గొణిగింది మహారాణి.

అందుకు వంతపాడింది మహిమ.

'ఛఛ.. ఈ పిచ్చిదాన్ని త్వరగా వదిలించుకోవాలి' కోపంగా అనుకున్నాడు ఉశీనరుడు.

... ఇంకా ఉంది

పిచ్చిదని ముద్రపడిన మాధవి ఎలా పురుడుపోసుకుంది? ఆమె ఎవరి ఆదరణ పొందింది?

కొడుకో కూతురో పుట్టాక, గడువు ప్రకారం గాలవుడు వస్తే మాధవిని ఎక్కడికి తీసుకెళతాడు?

మిగిలిన రెండొందల గుర్రాలు ఏ రాజ్యంలో ఉన్నాయో తెలుసుకుని అక్కడకు తీసుకెళ్తాడా...పిచ్చిదని వదిలేస్తాడా?

వచ్చే సంచికలో...

క్యాంపస్ ఛాట్

> వణికిస్తున్న చలిలోనూ బయటికెళ్లక తప్పదు. వరండాలో కూర్చోక తప్పదు. ఎంత చలేసినా పరీక్షల భయం ముందు దిగదుడుపే"

కె శివలీల

చ... చ... చదువు... చలి!



"రాత్రి చాలా సేపు చదువుకోవాలి..." వీలుకాలేదా...?
"త్వరగా పడుకుని, రేపు రెండుగంటలకే లేవాలి..." కుదరలేదా...?
"అలారం పెట్టుకుంటే సరి... వెంటనే లేవొచ్చు..." ఏమాత్రమూ సాధ్యం కావట్లేదా...?

ఇదేంటి...? ఇలా ప్రతి విషయంలోనూ వ్యతిరేకత ఎదురౌతోందెందుకు? అనుకుంటున్నారా. కారణం చలి...! అవును. "రాత్రిపూట ఎక్కువసేపు చదువుకోవాలనుకుంటాం. చలిగా అనిపిస్తుంది. పొద్దున్నే లేవాలనుకుంటాం. అలారం పెట్టుకుంటాం. అక్కడి వరకు ఓకే. ఆ తరువాతే... అలారం మోగుతుంటే... 'ఎవరో ఒకరు లేచి ఆఫ్ చేస్తారు. మిగిలిన వారిని లేపుతారు' అని ఎవరికి వారే అనుకుంటూ అందరమూ నిద్రపోతూనే ఉంటాం" అని కొందరు విద్యార్థులు విచారం వ్యక్తం చేస్తుంటే... "పరీక్షలున్నాయని గుర్తుచేసుకుంటే చాలు చలి చిటుక్కున మాయమైపోతుంది" అని మరి కొందరు చెబుతున్నారు.

"మా అమ్మ నన్ను ప్రతిరోజూ నాలుగ్గంటలకే నిద్రలేపేవారు. లేచినప్పుడల్లా 'కరెంటు పోతే బాగుండు చక్కగా నిద్రపోవచ్చు' అనుకుంటూ... చాలాసేపు బెడ్‌పై

కూర్చునే దాన్ని. ఇక తప్పదని పుస్తకం ముందేసుకునేదాన్ని. ఇప్పుడు హాస్టల్‌లో ఉంటున్నాను కదా. ఎంత చలిగా ఉన్నా... చచ్చినట్టు నేనే లేవాలి. రూమ్మేట్స్ అందరూ పడుకున్న తర్వాత చదువుకోవాలంటే... వణికిస్తున్న చలిలోనూ బయటికెళ్లక తప్పదు. వరండాలో కూర్చోక తప్పదు. ఎంత చలేసినా పరీక్షల భయం ముందు దిగదుడుపే" అంటోంది హారిక

"అలారం మోగుతూనే ఉంటుంది. అందరూ లేస్తారు. 'పొద్దున్నే నిద్రలేవాలి' అని అలారం పెట్టుకున్న ప్రణీత మాత్రం లేవదు. ఇక చలికాలమైతే సరేసరి. పడుకోబోయేముందు మాత్రం చాలా సిన్సియర్‌గా అలారం మోగగానే వీరెవ్వరూ లేవకండే. నన్నే లేపండి. ఒక వేళ లేవకపోతే దుప్పటి తీసేయండి. గట్టిగా కొట్టండి. నేనేమీ అనుకోను' అని మరీమరీ చెబుతుంది. అలారం శబ్దానికి మేమందరం నిద్రలేస్తాం. ఆమె లేవదు. మేం లేపబోతే... 'రెండు నిముషాలు పడుకుంటానే. ప్లీజ్" అని ప్రాధేయపడుతుంది. ఇక అంతే... అరగంటైనా.. గంటైనా... లేవదు. నేనూ ఇదివరకు అలారం మోగగానే టక్కున లేచేదాన్ని. ఇప్పుడు దానిలాగే తయారయ్యాను" అంటోంది మైక్రోబయాలజీ విద్యార్థిని సరిత.

"ఇక చలికాలంలో పొద్దున్నే నిద్రలేవడమా? అమ్మో! చలికి చర్మం రఫ్‌గా అయిపోదూ. అందుకే నేను ఆలస్యంగా నిద్రలేస్తాను. వెంటనే ఓ అరగంట ఎండలో కూర్చుంటాను. ఫలితం క్లాసుకు ఓ అరగంట ఆలస్యం. మా తెలుగు లెక్చరర్ ఏమీ అనేవారు కాదు. నా బాడ్ లక్. టైం టేబిల్ మారింది. అదీ చలికాలంలోనే. ఫస్ట్ అవర్ మాథ్స్. ఆయన చండశాసనుడు. ఒక్కనిముషం లేటుగా వచ్చినా లోపలికి రానివ్వడు. అలవాటు ప్రకారం నేను లేటుగా లేచాను. తీరిగ్గా రెడీ అయ్యాను. క్లాసు దగ్గరికి రాగానే గుర్తొచ్చింది ఫస్ట్ అవర్ మాథ్స్ అని. మొదటి రోజు కదా వదిలేస్తాడనుకుని ధైర్యంగా ముందుకు నడిచా. క్లాసు గుమ్మం దగ్గర నిలబడ్డా. అది గమనించిన మా మేథ్స్ లెక్చరర్ 'అక్కడే ఉండు, క్లాసులో ఇంకా చలి కదా' అన్నారు. నేను ఆ అవర్ అయ్యేంత వరకూ బయటే ఎండలో నిలుచున్నాను. అప్పటి నుంచి చలివేసినా, ఎంత బద్ధకంగా అనిపించినా కాలేజీకి ఇన్‌టైంలోనే వెళ్లేదాన్ని" అని చెబుతోంది హరిత.

అలారం మోగుతోంది.... వెంటనే మీరు నిద్రలేస్తారా? ఎంతసేపు మోగినా నిద్రలేవని రూమ్మేట్స్ మీకున్నారా? వెంటనే వారి అలవాటును మార్చడానికి ప్రయత్నించండి. ఈ ప్రయత్నంలో వారి అలవాటు మీకు రాకుండా జాగ్రత్త పడండి మరి. లేకపోతే "లెఫ్ట్ రైటైతే నో ఎక్స్క్యూజోయ్... నో డిఫీటోయ్" అని పాడుకోవాల్సొస్తుంది. *



చందు



> సినిమా హాల్లో నేలపై కూర్చొని తెరపైన కనిపించే నాగేశ్వరరావు, ఎన్.టి.ఆర్.లను చూసి జీవితంలో ఎప్పుడైనా వీళ్ళను నిజంగా చూడగల్గుతానా అనుకునేవాడ్ని. వాళ్ళని చూడటమే కాదు... నాగేశ్వరరావు, ఎన్.టి.ఆర్.లకు తండ్రిగా, మామగా కూడా నటించాను. అంతకంటే మించిన అదృష్టం ఏముంటుంది?!

డబ్బులు రాకపోయినా...ఈ ఆనందం వేరు!

'ఆ రోజుల్లో మేము సినిమాల్లో నటించడం మా అదృష్టం. ఈ రోజుల్లో నటించకపోవడం మా అదృష్టం' అని గుమ్మడిగారు ఎప్పుడూ అంటుంటారు. నాది కూడా ఇదే ఫీలింగ్. మాకనుగుణమైన వేషాలు వాళ్ళ దగ్గరుండవు. ఉన్నా పాత్ర సమగ్రంగా ఉండదు. సినిమాలో వేషం ఏమిటని అడిగితే ఇంకా తేల్లేదండీ.... అదిగానీ, ఇదిగానీ అనుకుంటున్నాం అంటారు. దీంతో చేయాలన్న ఇంట్రెస్ట్ కూడా పోతోంది. నాటకాలు మాత్రం మానకుండా ఇంకా వేస్తున్నాం. సినిమాల్లో డబ్బులు వస్తాయి. ఇందులో రావు. రాకపోయినా ఇందులో ఉండే ఆనందం అందులో ఉండదు.

పర్ఫెక్షన్ ఏది?

ఇప్పుడసలు థియేటర్‌కెళ్ళి సినిమా చూసి 16 ఏళ్ళయింది. పోనీ టీవీలో చూద్దామా అంటే మధ్య మధ్యలో యాడ్స్ గొడవ. ఇంతలో ఫోన్ వస్తుంది. నచ్చిన సినిమా ఏమన్నా ఉందంటే సీడీ తెచ్చుకుని చూస్తూ ఉంటాను. పాత సినిమాలన్నీ క్యాసెట్ల రూపంలో ఉన్నాయి. వాటినే చూస్తూ ఉంటా. నాకు సినిమా నచ్చాలంటే అందులో మంచి సంగీతం ఉండాలి. ఆర్టిస్ట్ నటన బాగుండాలి. ఈ సన్నివేశాన్ని ఎంత బాగా తీశాడురా అనిపించాలి. పాత సినిమాలు మాకొక ఎడ్యుకేషన్. ఈ మధ్య కాలంలో నాగయ్యగారి వర్ధంతిని పురస్కరించుకుని మద్రాసులో ఆయన నటించిన 'త్యాగయ్య' చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడటానికి కె. విశ్వనాథ్‌గారు స్టేజ్ మీదకొచ్చారు. చాలాసేపు మాట్లాడలేదు. 'నాకు ఈ సినిమా గురించి మాట్లాడటానికి అర్హత లేదు. ఇన్ని సినిమాలు డైరెక్షన్ చేశాను. గొప్ప దర్శకుడని అనిపించుకున్నాను. కానీ ఇందులో ఒక్క షాట్ కూడా ఊహించలేకపోయాను' అని అన్నారు. ఆ రోజుల్లో నటుల్లో పర్ఫెక్షన్ అంత ఉండేది. షాట్ బాగా రావడానికి రోజంతా కష్టపడేవారు. లేదంటే తర్వాత రోజు తీసేవారు. ఈ రోజు ముంబాయి నుండి ఉదయం హీరోయిన్ వస్తుంది. సాయంత్రానికి వెళ్ళిపోవాలి. ఐదు సీన్లు తీయాలి. పర్ఫెక్షన్‌కి అవకాశం లేకుండా చేసుకున్నారు. ఆ రోజుల్లో 'నర్తనశాల' చిత్రంలో ఎన్.టి.ఆర్ ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు. మూడు నెలలపాటు తెల్లవారు జామున 4 గంటలకు లేచి ఐదింటి వరకు డాన్స్ రిహార్సల్స్ చేశారు. డైలాగ్స్ ముందే పంపిస్తే కంఠతా పెట్టుకుని ఎలా చెప్పాలా అని ప్రాక్టీస్ చేసేవారు. ఆ సినిమా ఇప్పటికీ నిలబడిందంటే కారణం ఆ పర్ఫెక్షనే.

డైరెక్టర్ అవ్వలేరన్నారు

రామినీడు గారని ఒక డైరెక్టర్ ఉన్నారు. మా నాటకాల్లో కూడా నటించారు. ఆయన ఒక రోజు కలిస్తే, 'మీరు ఎన్నేళ్ళ నుంచి డైరెక్షన్ లైన్‌లో ఉన్నారు' అని అడిగారు. ఆరేళ్ళ నుంచి ఉన్నా అన్నాను. 'డైరెక్టర్ అవ్వాలని ఉందా' అని అడిగారు. అవునంటే... 'డైరెక్టర్ అవ్వాలంటే మూడు మార్గాలున్నాయి. మీకు డైరెక్షన్ ఛాన్స్ ఇచ్చే కంపెనీ వాళ్ళు ఎవరన్నా ఉన్నారా' అన్నారు. లేరు... 'ఈ సినిమా మా అసిస్టెంట్ చేస్తాడు. ఒక్కసారి ఛాన్స్ ఇవ్వండని' చెప్పేవాళ్ళు ఎవరన్నా ఉన్నారా? అని అడిగారు. దానికీ లేరన్నాను... 'మీ స్నేహితులతో కలసి సినిమా తీయగలరా? అబ్బెబ్బే అన్నాను... 'అలాంటప్పుడు మీరు డైరెక్టర్ అవ్వలేరు' అన్నారు. మీకు ఎలాగైనా యాక్టింగ్ టాలెంట్ ఉంది కదా. అందులో ట్రై చేయండి అందులో సక్సెస్ అయితే అయ్యారు. లేకపోతే ఎలాగూ డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ ఉంది కదా' అని ఆయన అన్నప్పుడు ఆలోచించి నటన వైపు మొగ్గాను.

ఓహో ఇదొక పద్ధతా...

అక్కినేని నాగేశ్వరరావుగారు నుంచి చాలా విషయాలు తెలుసుకున్నాను. ఒక రోజు ఓ చిత్రం షూటింగ్ జరుగుతోంది. షూటింగ్ మొదలైన దగ్గర నుంచీ హీరోయిన్‌పైనే తీస్తున్నారు. నాగేశ్వరరావుగారిని పట్టించుకోవడం లేదు. ఈయన మేకప్ వేసుకుని అలాగే కూర్చున్నారు. లంచ్ తర్వాత కూడా హీరోయిన్‌పైనే తీస్తున్నారు. నేను ఉండబట్టలేక చనువుతో 'మీపై ఒక్క షాట్ కూడా తీయలేదు. ఎందుకొచ్చినట్లు. అడగండి' అన్నాను. 'నేను అడగను. వాళ్ళకిచ్చింది రెండు రోజులు. ఇవ్వాళ, రేపు. నాపైన తీసుకున్నారా లేదా అన్నది నాకనవసరం. ఎల్లుండి వాళ్ళకి పని చేయను కదా! రేపు సాయంత్రం లోపల తీసుకున్నారా తీసుకున్నారు. లేకపోతే నేను బాధ్యుడ్ని కాదుకదా' అన్నారు. ఓహో ఇదొక పద్ధతా అని అనుకున్నాను.

చిన్నప్పుడు సినిమా హాల్లో నేలపై కూర్చొని తెరపైన కనిపించే నాగేశ్వరరావు, ఎన్.టి.ఆర్.లను చూసి జీవితంలో ఎప్పుడైనా వీళ్ళను నిజంగా చూడగల్గుతానా అని అనుకునేవాడ్ని. వాళ్ళని చూడటమే కాదు నాగేశ్వరరావు, ఎన్.టి.ఆర్.లకు తండ్రిగా, మామగా కూడా నటించాను. అంత కంటే మించిన అదృష్టం ఏముంటుంది.

*

చిన్నారి చిత్రకారులు



పి.బాల సూర్య ప్రద్యుమ్న, 3వ తరగతి,
టక్కర్ బాబా స్కూల్, నిడదవోలు, ప.గో.

పి.నాగసౌజన్య, 8వ తరగతి,
జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల,
నిడదవోలు, ప.గో.

రంగు బాలశేఖర్, 4వ తరగతి,
బాలకార్మిక పాఠశాల, చేర్యాల,
వరంగల్.

చేప చిక్కిన గేలం ఏదబ్బా!



హేయ్ చిన్నారులూ... ఓ నలుగురు పిల్లలు వేటకెళ్లారు. ఎందుకోతెలుసా. చేపలు పట్టడానికి. అందరూ ఎంతో హుషారుగా చెరువు ఒడ్డున కూర్చుని గేలాలు వదిలారు. కాసేపటికి నలుగురి గేలాలూ బరువెక్కాయి. అంతే వారు ఎంతో హుషారుగా 'చేప దొరికిందోచ్' అని పెద్దగా అరిచారు. తీరా బయటకు తీసి చూస్తే ఏముంది? ఒకరికి మాత్రమే చేప పడింది. మిగతావారికి ఎండ్రకాయ, తాబేలు పిల్ల, కప్ప పడ్డాయి.

ఆ దృశ్యాన్ని ఓ ఆర్టిస్టు అంకుల్ చూసి బొమ్మగీసి మాకు పంపారు. కాకపోతే చేప ఎవరిగేలానికి వుందో మీరే తెలుసుకోవాలి. మరి ప్రయత్నించండి.

రంగులేసేద్దాం



చుక్కలు కలపండి



పరాయి పిల్ల ఎవరో?

నేస్తాలూ... కింద ఒక పెద్ద కుక్క, ఆరు కుక్క పిల్లలు వున్నాయికదూ. అసలు విషయం ఏంటంటే... ఆ పెద్ద కుక్కకు ఈ మధ్యే పిల్లలు పుట్టాయర్రా! అవి మొత్తం ఐదే. కాకపోతే ఓ రోజు ఉదయాన్నే లేచి చూసేసరికి ఆరు కుక్కపిల్లలున్నాయి. పరాయిపిల్ల ఎవరో తల్లికి ఎంతకీ తెలియలేదు. మరి అన్నీ ఒకేరకంగా వున్నాయంట. ఇక దానికి ఏంచేయాలో తెలీలేదు. అందుకని అదేం చేసిందంటే... ఎంచక్కా ఓ గ్రూప్ ఫొటో దిగి మాకు పంపింది. ఎందుకంటే... మీరు చాలా తెలివిగలపిల్లలుకదా. చిటికెలో తెల్సుకుని చెప్తారని దాని ఆశ. మరి కొద్దిగా తేడాగా వున్న కుక్కపిల్ల ఏదో చెప్పండి?



బాలనేస్తాలు

4.12.05 సరైన సరైన సమాధానం రాసినవారు

యు.యు.బాబు నరేంద్రప్రసాద్ (8), కె.కవిత (9), టి.కె.సృజన కుమారి (9), యం.పవన్‌కుమార్ (9), యం.ప్రవీణ్ కుమార్ (9), యం.వినయ్ కుమార్ (9), కె.ప్రకాష్ కుమార్ (9), వై.ఎస్.రాజశేఖర రెడ్డి (10), యు.భీమలింగ (10), బి.నరసింహులు (10), జి.సునందపవన్ (10), వి.మంజునాథ్ (10),యం.అమ్రేష్ (10), బి.రవితేజయాదవ్ (10), జి.నాగేష్ (10), కె.వి జయ్‌కుమార్ (10); కె.యస్.మాలిక్‌భాష (10), ఆర్.రంజాన్ (10), టి.యండి.నాసిర్ (10); యం.ప్రసాద్ (10); యు.ఎస్.అనిల్ (10), యు.యం.డి.నాసిర్ (10), యు.ఈరన్న (10), యం.రమేష్ (10), యం.తిమ్మప్ప (10), కె.మజార్ హుస్సేన్ (10), శ్రీ వేణు విద్యాలయం, లక్ష్మీపేట, ఎమ్మిగూరు. ఎన్.నాగరాజు (8), అమ్మిరెడ్డిగూడెం, కృష్ణా. పి.శ్రీను, కోదాడ, నల్గొండ. నల్లగొండ లక్ష్మణ్, తల్లాడ, ఖమ్మం. సిహెచ్.లెనిన్‌కుమార్, తోటరావుపాడు, కృష్ణా. డి.విష్ణుమూర్తి, జె.రాహుల్ (9), ముదోల్, ఆదిలాబాద్. బి.వేదవతి (7), ఆర్.హేమలత (3), అశోక్‌నగర్, అనంతపురం. ఎం.యశవతి (5), ఎం.పూజితారాణి (8), ఎం.సాయివీరేంద్ర (5), ఎస్ఆర్‌కె కాన్వెంట్. పి.రాధాకృష్ణ, నెల్లిపాక, ఖమ్మం. ఎం.కమలాకర్ (10), కె.నాగలక్ష్మి (10), తల్లాడ, ఎం.కళ్యాణి, కొత్తగూడెం, కటుకూరి సాగర్ (10), ఖమ్మం. సిహెచ్ కరిష్మా (4),సిహెచ్. మునురున్నిసా (5), అద్దంకి సల్మా సుల్తాన (10), పి.బాజిష్ బేగం (10), సిహెచ్ నజీర్ ఖాన్ (4), కె.ఆరిఫ్ (7), సిహెచ్.నశింఖాన్ (7), సిహెచ్ సల్మాన్‌ఖాన్ (6), సిహెచ్ బాష ఖాన్ (8), ఎస్‌కె.సలామ్ (7), దండు కరీం (7), సిహెచ్ బషీర్‌ఖాన్ (1), నన్నూరి శ్రావణ్‌కుమార్ వినుకొండ, గుంటూరు. పారా శివకార్తీక్ (4), నేరెళ్ల సాయిప్రసన్న (7), వేల్పూరు, గుంటూరు. టి.హైమ (7), ప్రకాష్ నగర్, నరసరావుపేట. పి.హిమబిందు (10), చినరంగనిపాలెం, భీమవరం. బి. శ్రీలేఖ (6), కోరలగుంట. ఎన్.శంకర్‌నాయక్ (8), కె.హరికృష్ణ (8), కె.శ్రీను (8), ఆర్ వినోద్ (7), జి.బాబు (7), జి.ఆనంద్ (10), జి.రవి (10), ఒ.వినోద్ (8), సిహెచ్ విజయబాబు, జ్యోతి (8), అనపర్రు. కె.శ్రీ తన్మయ (3), బ్రాడీపేట, గుంటూరు. సిహెచ్ జ్యోతిష్ (5), కొండా నాగ ప్రణీత్, కామిశెట్టి బాబీ (6), నల్లి రాహుల్ (6), మాలికిపురం. పి.వినీత (7), పి.కృష్ణ సత్యప్రియ (4), నెల్లూరు. ఒ.నిఖిత (5), మక్తల్, మహబూబ్‌నగర్. కందుకూరి ప్రకాష్, తణుగురు గౌతమి (8), కె.సోనీ, కె.సువర్ణ, కె.రాధ, అరవిందు (4), రిచిత్ (2), సెయింట్ ఆన్స్ స్కూలు. ఆర్.రూతు అనిల్ కుమార్ (10), అమీన్ పూర్, మహబూబ్‌నగర్. నేలవెల్లి నరేంద్ర, ఎన్.సతీష్ (10), సిహెచ్.రాజశేఖర్ రెడ్డి (9), సిహెచ్ దిలీప్‌రెడ్డి (10), గురజాల. ఆలూరి రాజా, నెల్లూరు. సిహెచ్ లెనిన్‌కుమార్ (4), నందిగామ. పి.భీమేష్ (9), పాతర్‌చేడ్. పి.రాజ్‌కుమార్ (9), ధన్వాడ. ఆర్‌పి.రాజా (7), ఘనపూర్. టి.వి.ఎల్.నాయక్, జనగాం. కె.మనోజ్ రాహుల్ (9), మోరి. వి.నరసింహ (8), వి.ఆంజనేయులు (8), పి.శివకుమార్ (8), నాగర్‌కర్నూల్.

వీరి వీరి గుమ్మడిపండు వీరి పేరేమి?



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదెవరో చెప్పకోండి చూద్దాం. వీరు మానవ అభివృద్ధికి ఎంతగానో సాయపడే విమానాన్ని కనుగొన్నారు. అది ఫొటోలో వారి వెనుకే వుందికూడా. ఇంతకీ వీరెవరైవుంటారు? తెల్సిపోయిందా? మరైతే వెంటనే కార్డుమీద రాసి పోస్టు చెయ్యండి. మరి మా చిరునామా:

11.12.05 సమాధానం:
పొట్టి శ్రీరాములు

వీరి వీరి గుమ్మడి పండు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

అట్టమీది కథ

ఎం కోటేశ్వరరావు

బడ్డీలకు టెడ్డీ ఫోన్లు

డాడి...... డాడీ...... నన్నెవరో కిడ్నాప్ చేశారు.....
మన డ్రైవర్ను కొట్టిపడేశారు......నన్నెత్తుకు పోతున్నారు.
డాడీ.. త్వరగా రా డాడీ....
అంకుల్ కొట్టొద్దంకుల్..........

అంతే ఒక్కసారిగా సెల్‌ఫోన్‌లో మాటలు ఆగిపోయాయి. సాయంత్రం నాలుగు గంటలు. ఆఫీసులో బిజీగా ఉన్న బంజారా హిల్స్‌లోని ధనవంతుల్లో ఒకరైన రామారావుకు వెంటనే ఏం చేయాలో తోచలేదు. వెంటనే సెల్ కాల్‌సెంటర్‌కు ఫోన్ చేశారు. తమ కుమార్తెను ఎవరో కిడ్నాప్ చేశారని, ఆమె లొకేషన్ ఎక్కడుందో వెంటనే తెలపమని తొందర పెట్టారు.

ఒక్క నిమిషం అంటూ.... మీ పాప చార్మినార్ ప్రాంతంలో ఉంది. ఆమెను బెంగుళూరు రహదారివైపు తీసుకుపోతున్నారు. అని కాల్‌సెంటర్ సమాచారం ఇచ్చింది. రామారావు వెంటనే ఆ ప్రాంత ట్రాఫిక్ ఏసిపికి ఫోన్ చేసి తన కుమార్తెను కిడ్నాప్ చేసి చార్మినార్ మీదుగా బెంగుళూరు రహదారివైపు తీసుకుపోతున్నారని ఫిర్యాదు చేశారు.

వెంటనే వైర్‌లెస్ సెట్లు మోగాయి. కిడ్నాపర్లు జూ పార్కు వద్ద పోలీసులను తప్పించుకున్నారు. సాయంత్రం ఆరు గంటలకు అర్జంట్ ప్రెస్ కాన్ఫరెన్సు ఉందంటూ విలేకర్లకు కబురు పెట్టారు. తమ సిబ్బంది గంటవ్యవధిలోనే నేషనల్ పోలీస్ అకాడమీ వద్ద కిడ్నాపర్లను పట్టుకొని నికిత అనే తొమ్మిదవ తరగతి విద్యార్థిన్ని కాపాడినట్లు నగర కమిషనర్ వెల్లడించారు. పట్టుకున్న సిబ్బందికి రివార్డు ప్రకటించారు. మరుసటి రోజు కిడ్నాప్ జరిగిన గంటలోనే దుండగుల పట్టి వేత అంటూ వార్తలు.

మన పోలీసులు ఇంత సమర్థవంతంగా ఎలా పని చేశారబ్బా అనుకున్నవారు కొందరు. డబ్బున్న వారి పిల్ల కాబట్టి అలా చేశారు. అదే సామాన్యులైతే నెలల తరబడి దిక్కుండదు. మొన్న హైకోర్టు అలాంటి కేసుల్లో ఎలాంటి చివాట్లు వేసిందో చూడలా... ఇలా ఎవరికి తోచింది వారనుకున్నారు...... ఇదంతా నిజమనుకుంటున్నారా? నిజం చేస్తాం అంటున్నాయి సెల్‌ఫోన్ సంస్థలు. ఆ కథేమిటో తెలుసుకోవాలనుందా? కాస్త ఖర్చవుతుంది మరి. పిల్లల రక్షణ కంటేనా అంటారా. అదే నండీ బాబూ మనలో ఉన్న ఈ బలహీనతను, అభద్రతా భావం, పరిస్థితులను సొమ్ము చేసుకోవాలనుకుంటున్నాయి సెల్ కంపెనీలు.



టెడ్డీ ఫోన్ ... న్యూ ఎరైవల్

నవంబరు నెల చివరి వారంలో లండన్ మార్కెట్‌లో టెడ్డీ ఫోన్లు మార్కెట్‌లోకి వచ్చాయి. ఈ ఫోను మీ బాబు లేదా పాప చెంత ఉంటే మీకు వద్దు వారి గురించి చింత అంటున్నారు వీటి తయారీదార్లు. ఇంతకూ ఈ ఫోను ఎలా ఉంటుందనుకుంటున్నారు. టెడ్డీబేర్ బొమ్మ ఆకృతి. అందుకే ఆ పేరు పెట్టారు. మామూలు సెల్‌ఫోన్లకు ఉండే స్క్రీన్ స్థానంలో నాలుగు బటన్లు ఉంటాయి. అంటే నాలుగు కనెక్షన్లు మాత్రమే ఉంటాయి. ఈ ఫోన్లు అమ్మా నాన్నల వద్ద ఉండే లేదా కుటుంబంలోని ఇద్దరు సభ్యుల లేదా స్నేహితుల వద్ద ఉండే సెల్‌ఫోన్లకు కనెక్ట్ చేయవచ్చు. అంటే ఫోను కొన్న వెంటనే ఏ నంబర్లకు కనెక్షన్‌లు ఇవ్వాలో అమ్మా నాన్నలు సెట్ చేస్తారు. పిల్లలు చేయవలసిందల్లా వాటిని పుస్తకాల సంచుల్లో పెట్టుకు పోవటమే.

బొమ్మ ఫోన్‌లో ఇలా మాట్లాడాలి!

ఎప్పుడైనా అమ్మానాన్నలతో మాట్లాడాలనుకుంటే ఒక బటన్ నొక్కితే వారితో మాట్లాడవచ్చు. అమ్మానాన్నలు మాట్లాడాలనుకుంటే మామూలు ఫోన్లలాగే రింగ్ వినిపిస్తుంది. ఎప్పుడైనా పిల్లలు స్నేహితులతో ఆడుకుంటూ దారి తప్పి ఇంటికి ఎలా వెళ్లాలో తెలియలేదనుకోండి, లేదా ముందుగా చెప్పినట్లు ఎవరైనా దుండగులు కిడ్నాప్ చేశారనుకోండి. (మనలో మాట స్కూలుకని చెప్పి ఎక్కడికో చెక్కేయటానికి అవకాశం ఉండదు మరి. ఎందుకంటే మీరెక్కడున్నారో తెలుసుకొనే సౌకర్యం అందులో ఉంది మరి. తల్లిదండ్రులు తమ వద్ద ఉన్న ఫోన్‌తో టెడ్డీఫోన్ మానిటర్ ద్వారా శబ్దాలు వినే అవకాశం ఉంది. అది పని చేస్తున్నట్లు మనకు తెలియదుగా మరి...ప్చ్.....). ప్రమాదంలో పడినట్లు భావించిన వెంటనే ఫోన్‌లోని ఎమర్జన్సీ బటన్ నొక్కితే టెడ్డీఫోన్ నుండి కనెక్షన్ ఉన్న నంబర్లకు సంకేతాలు అందుతాయి. సంబంధిత సెల్‌కంపెనీ నెట్‌వర్క్ ఆ ఫోన్ ఏ ప్రాంతంలో ఉందో జియో లోకేషన్ వ్యవస్థద్వారా పసిగడుతుంది. ఆ వివరాలు తెలియగానే పిల్లలను కనుగొనటం లేదా, దుండగులనుండి రక్షించటం సులభం అంతే అంటున్నారు టెడ్డీఫోన్ తయారీదార్లు. తల్లిదండ్రులను ప్రలోభపరచటానికి రెండేళ్లవరకు ఎలాంటి అద్దె ఉండదని, ఫోన్ ఉచితంగా ఇస్తామని, ఫోన్ ఉపయోగించిన దానిని బట్టి బిల్లు వేస్తామని కంపెనీ ప్రకటించింది.

టెడ్డీ ఫోన్‌కీ చిక్కులున్నాయా ?!

ఇది వినటానికి సొంపుగానే ఉంది. ఇప్పటికే పిల్లలకు అవసరం లేని ఫాస్ట్, జంక్ ఫుడ్‌లను అలవాటు చేసిన బహుళజాతి సంస్థలు తల్లిదండ్రుల జేబులు కత్తిరిస్తున్నాయి. ఇప్పుడు వాటితో పాటు టెడ్డీఫోన్లు కూడా అంటే అటూ ఇటూగాని మధ్యతరగతి నలిగిపోవాల్సిందే. అవసరం కంటే హోదా ప్రదర్శన పోటీలో వెనుకా ముందు చూడకుండా ఉన్న కొందరి అలవాట్లు పిల్లల మీద ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో (మనీ) కాన్సెప్ట్, కార్పొరేట్ స్కూళ్లను చూస్తే తెలుస్తుంది.

పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వటంపై అనేక దేశాలలో అభ్యంతరాలున్నాయి. వాటిని ఇతరులు దుర్వినియోగం చేయవచ్చన్నది ప్రధాన అభ్యంతరం. అశ్లీల సమాచారం, ఫొటోలు పంపే అవకాశం ఉంటుందన్నది ఒకటి. సినీ హీరోయిన్లు ప్రీతి జింటా, మల్లికా షెరావత్ నగ్న చిత్రాల పేరుతో ప్రస్తుతం అనేక ఫోన్లకు అందుతున్న ఫొటోలు పిల్లలకు చేరవన్న గ్యారంటీ లేదు. ఢిల్లీ, మరికొన్ని పట్టణాలలో పిల్లలు కొందరు



తోటివారి నగ్న చిత్రాలను కెమెరా ఫోన్లలో బంధించి మిత్రులకు పంపిణీ చేసిన ఉదంతం మనకు తెలిసిందే. తరగతిలో ఒకరి వద్ద ఫోన్ ఉన్నా చాలు మిగతా పిల్లలకు అలాంటి సమాచారం అందటం, ఫోన్లకోసం పిల్లలు ప్రయత్నించటం పర్యవసానం అని వేరే చెప్పనవసరం లేదు. అయితే టెడ్డీఫోన్లు అందుకు ఆస్కారం ఇవ్వవు అంటున్నారు.

కొందరికి ఇక్కడ కొన్ని ప్రశ్నలు తలెత్తవచ్చు. అసలు పిల్లలకు ఫోన్లెందుకు? వారి రక్షణ కోసం అంటున్నారు. ఫోను పిల్లలను రక్షిస్తుందా? నిజానికి కిడ్నాప్ చేయదలచుకున్నవారికి ఆ పిల్ల లేదా పిల్లాడి వద్ద టెడ్డీ ఫోను ఉందా లేదా అన్నది తెలుసుకోవటం అంతకష్టమా? తెలుసుకుంటే దానికి తగిన జాగ్రత్తలు తీసుకోరా? నిజానికి రక్షణలేని పిల్లల శాతం ఎంత? ఇప్పుడు పిల్లల వద్ద సెల్‌ఫోన్లు లేవా?

పిల్లలకు సెల్‌ఫోన్లివ్వొచ్చా..?

ఆసియా ఖండంలోని 12 దేశాలపై సర్వే జరిపిన ఒక సంస్థ హాంకాంగ్‌లో 6-15 సంవత్సరాల వయస్సున్న పిల్లల్లో 29 శాతం సెల్‌ఫోన్లు కలిగి ఉన్నారని తేల్చింది. ఆస్ట్రేలియా, జపాన్‌లో 25 శాతం మంది కలిగి ఉన్నారు. హాంకాంగ్‌లో ఇంత ఎక్కువగా ఎందుకున్నాయంటే ఛార్జీలు తక్కువగా ఉండటమే ప్రధాన కారణం. కేవలం 70లక్షల మంది జనాభా ఉన్న అక్కడ ఏడు సెల్‌కంపెనీలు ఉన్నాయి. అదే జపాన్‌లో కేవలం మూడు కంపెనీలే సేవలు అందిస్తున్నాయి. అమెరికాలో నాలుగోవంతు ఎలిమెంటరీ స్కూలు పిల్లలకు, ఆపై వారికి మూడింట రెండువంతుల మందికి ఫోన్లున్నాయి. జపాన్‌లో సీనియర్ హైస్కూలు(కాలేజీ) వారికి 80శాతం మందికి ఉన్నాయి. ఐరోపా దేశాలలో పిల్లలకు ఎక్కువ శాతం మందికి ఫోన్లు ఉన్నాయి.

పిల్లలకు ఫోన్లు ఇవ్వటాన్ని వ్యతిరేకించే వారు చెబుతున్న ఇతర అంశాలు కూడా కొట్టిపారవేయలేము. బ్రిటన్‌లో పిల్లలకు ఫోన్లు ఇవ్వటంపై చర్చ జరిగింది. తొమ్మిదేండ్ల వయస్సు లోపు వారు అసలు సెల్‌ఫోన్ వినియోగించ కూడదని, 9-14 ఏండ్ల వారు పరిమితంగా అత్యవసరమైతేనే ఉపయోగించాలని ప్రభుత్వ సలహాదారు సర్ విలియం అంటారు. పిల్లల కపాలాలు తొమ్మిదేండ్ల వరకు పూర్తిగా గట్టిపడవని, నాడీవ్యవస్థ కూడా పూర్తిగా ఎదగదని అందువలన అణుధార్మికత(రేడియేషన్) మెదళ్లకు సోకుతుందని విలియమ్స్ ఏడాది క్రితం చెప్పారు. పెద్దల కంటే పిల్లల మెదడు 50 నుండి 70 శాతం వరకు అదనంగా అణుధార్మికతను అదనంగా తీసుకుంటుందని పరిశోధనలు వెల్లడించాయి. పిల్లలకు హాని చేస్తుందని తెలిసిన తరువాత వారిని ఉద్దేశించిన ఉత్పత్తులను విక్రయించటం బాధ్యతారాహిత్యం తప్ప వేరు కాదని వినియోగదారుల సంస్థ ప్రతినిధి అలాడెయిర్ ఫిలిఫ్స్ వ్యాఖ్యానించారు. విలియమ్స్ సలహా తరువాత ఒక బ్రిటీష్ కంపెనీ ప్రవేశపెట్టిన పిల్లల సెల్‌ఫోన్ అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. చివరకు ఆ మోడల్‌ను మార్కెట్ నుండి ఉపసంహరించింది. ఇంత జరిగాక ఇప్పుడు ఒక సంస్థ టెడ్డీ ఫోన్లను మార్కెట్‌లోకి తెచ్చింది. మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టే తాము తయారుచేశామని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పాల్ లిశ్చింగ్ అంటున్నారు. మా ఫోన్లను కొనాలా లేదా అనేది తల్లిదండ్రుల నిర్ణయానికి వదిలి వేస్తున్నాం. పిల్లలకు ఫోన్ ఇచ్చినందువలన కలిగే హాని కంటే ఇవ్వనందువలన ఎక్కువ కలిగితే వారికి ఫోన్ ఇవ్వండి. మేం తయారు చేసిన టెడ్డీఫోన్ మామూలు సెల్‌ఫోన్ల కంటే పదిరెట్లు తక్కువగా అణుధార్మిక వ్యర్థాలను విడుదల చేస్తుందని పాల్ తమ చర్యను సమర్థించుకున్నారు. మొబైల్ ఫోన్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రతినిధి తమ వైఖరిని వెల్లడిస్తూ సర్ విలియం సలహా ఇచ్చినట్లుగా పదహారేండ్ల లోపు వారికి సెల్‌ఫోన్లు విక్రయించకూడదన్నది మా వైఖరి. ఆరోగ్యానికి సంబంధించిన సలహాకు అనుగుణంగా ఇది బాధ్యతాయుతమైన వైఖరి అనుకుంటున్నాం అన్నారు.

సెల్‌ఫోన్లు ఎంతగా పెరిగి పోనున్నాయంటే 2007 నాటికి ఐరోపాలో ఫోను యజమానుల సగటు వయస్సు ఎనిమిది సంవత్సరాలు కాగా అమెరికాలో 12 ఏండ్లుగా ఉంటుందని వరల్డ్ వైర్లెస్ ఫోరం పరిశోధన వెల్లడించింది. బ్రిటన్ ప్రభుత్వం నియమించిన ఒక పరిశోధనా బృందం 2000 సంవత్సరంలో తమ నివేదిక సమర్పించింది. దాని ప్రకారం రేడియో తరంగాల అణుధార్మికత వలన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడినట్లు ఎలాంటి దాఖలాలు లేవు. అయితే తెలిసిన సమాచారంలో కొన్ని అంశాలు నివృత్తి కానందున సురక్షితమైన వస్తువుల జాబితాలో సెల్‌ఫోన్లను చేర్చకూడదు. పిల్లలకు సాధ్యమైన మేరకు దూరంగా ఉంచాలి. ఫోన్ల తయారీదార్లు వెలువడే రేడియో తరంగాల శక్తి ఎంతో ఫోన్లపై ప్రచురించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థకూడా ఎలాంటి ఆధారాలు లేవని, అయితే జాగ్రత్తలు తీసుకోవటం అవసరం అని పేర్కొన్నది. మరొక సర్వే ప్రకారం పదేండ్లుగా సెల్‌ఫోన్ ఉపయోగిస్తున్నవారికి పరిమితంగా వుపయోగించే వారితో పోల్చితే మెదడు నుండి చెవికి అమరి ఉండే నరంపై ట్యూమర్ రావటానికి రెండు రెట్లు ఎక్కువ అవకాశం ఉందని తేలింది. ఇన్ని విషయాలు తెలుసుకున్నాం కదా! మీలో అనేక మంది ఇంకా ఎక్కువ సమాచారం కూడా తెలుసుకొని ఉండవచ్చు. కొనుగోలు చేసే వారున్నారు గనుక తయారు చేస్తున్నామని కంపెనీలెన్ని కబుర్లైనా చెప్పవచ్చు. మనం విచక్షణ పాటించాలి. ప్రపంచీకరణలో భాగంగా పశ్చిమ దేశాలలో తయారయ్యే ఉత్పత్తులు తక్షణం తరువాత అడుగుపెడుతోంది మన దేశంలోనే. అందువలన మన పిల్లల భవిష్యత్ మన చేతుల్లోనే ఉంది.

*



ఆరోగ్యం

విటమిన్ల కథ

డాక్టర్ నాగినేని భాస్కరరావు

విటమిన్ - సి

విటమిన్ - సి ఒక యాంటీ ఆక్సిడెంట్. అంటే ప్రతికూల ఆక్సీకరణగా పని చేస్తుంది. దీనిని యాస్కార్బిక్ ఆమ్లము అని కూడా అంటారు. యాంటీ ఆక్సిడెంట్‌గా విటమిన్ - సి ఎలక్ట్రాన్స్‌ను దానం చేసి ఫ్రీరాడికల్స్‌ను ఆక్సిజన్ వర్గాన్ని పిండు కుంటుంది. విటమిన్ - సి నీటిలో కరిగే విటమిన్.

దీని ధర్మాలను పరిశీలిస్తే ఇది యాంటీ ఆక్సిడెంట్. మిగతా యాంటీ ఆక్సిడెంట్‌లైన విటమిన్ - ఇ, ఫ్లావనాయిడ్స్, గ్లుటీథియోసులను తిరిగి ఉత్పత్తి కావడానికి కృషి చేస్తుంది. ఆక్సీకరణ, క్షయకరణ క్రియల్లోనూ, హైడ్రోజన్ అణువు బదిలీ చర్యలలోనూ పాత్ర వహిస్తుంది. కనెక్టివ్ టిష్యూ మెటబాలిజమ్‌లో విటమిన్ - సి పాత్ర ముఖ్యమైనది. ఇంకా అనేక సంధాన చర్యలలో పాలు పంచుకుంటుంది. కార్టికో స్టెరాయిడ్లు, ఆల్డో స్టెరాన్ ఉత్పత్తిలోనూ, కొలెస్ట్రాల్ మెటబాలిజమ్ (జీవక్రియ) లోనూ విటమిన్ - సి పాత్ర వహిస్తుంది. కొన్ని ఎంజైము చర్యలలో కూడా విటమిన్ - సి పాలుపంచుకుంటుంది.

స్త్రీపురుషులిరువురికీ రోజూకు 60 మి.గ్రా. విటమిన్ - సి అవసరం. అయితే గర్భిణీ స్త్రీలకు రోజుకు 70 మి.గ్రా., పాలిచ్చే తల్లులకు 90 మి.గ్రా. విటమిన్ - సి అవసరం.

విటమిన్ - సి శక్తిపై ఆధారపడిన శాటురబుల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ వల్ల క్రమేపీ పెరుగుదల ఉండే పద్ధతిలో, పెంచుతున్న మోతాదులను బట్టి శోషింపబడుతుంది. వంద మిల్లీగ్రాముల కన్నా తక్కువ మోతాదులో ఇచ్చినట్లయితే విటమిన్ - సి 50 శాతం మాత్రమే శోషింపబడుతుంది. మగవారి శరీరంలోని అన్ని మూలాల నుంచి కలిపినట్లయితే 1500 మి.గ్రా. విటమిన్ - సి ఉంటుంది. దీనిలో మూడు శాతం రోజూ టర్నోవర్‌గా ఉంటుంది.

విటమిన్ - సి లోపం వల్ల స్కర్వీ అనే వ్యాధి వస్తుంది. మొత్తంగా శరీరంలో రోజుకు మూడు వందల మిల్లీగ్రాముల కన్నా తక్కువ ఉన్నట్లయితే విటమిన్ - సి లోపం వస్తుంది. స్కర్వీ జబ్బులో ఇంపైర్డ్ ఫార్మేషన్ ఆఫ్ కనెక్టివ్ టిష్యూ అనుసంధాన ధాతువుల జీవక్రియ దెబ్బ తింటుంది. చర్మం కింద రక్తస్రావం జరుగుతుంది. ముఖ్యంగా చిగుళ్ళ నుంచి రక్తం రావడం, చిగుళ్ళు వాయడం జరుగుతుంది. కీళ్ళలో రక్తస్రావం, ఉదర కుహరంలోనూ, గుండె పొరల్లోనూ, అడ్రినల్ గ్రంథుల్లోనూ రక్తస్రావం జరుగుతుంది. నీరసం, నిస్త్రాణం, మానసిక దిగులు వస్తాయి. పిల్లల్లో విటమిన్ - సి లోపం వల్ల పెరుగుదల తగ్గుతుంది. పరీక్షలలో ప్లాస్మా ద్రవంలో తక్కువ స్థాయిలో ఉన్న విటమిన్ - సి స్థాయి ద్వారా విటమిన్ - సి లోపాన్ని నిర్ధారించవచ్చు.

స్కర్వీ జబ్బుకు అనేక రోజుల పాటు రోజుకు 200 మి.గ్రా. విటమిన్ - సి ఇవ్వడం ద్వారా నయం చేయవచ్చు. ఇది నారింజ, నిమ్మ జాతికి చెందిన అన్ని రకాల పండ్లలో, ఆకు కూరల్లో, టమాటాలలో, ఆలుగడ్డలలో విటమిన్ - సి సమృద్ధిగా లభిస్తుంది.

*



సారీ.... చోటులేదు

స్కూటర్ మీద ఇద్దరిని ఎక్కించుకుని వస్తున్న అరుణాచలాన్ని చూసి బండి ఆపమని సైగ చేశాడు. ట్రాఫిక్ కానిస్టేబుల్

"సారీ సార్, ఇప్పటికే ముగ్గురం ఉన్నాం. మీకు చోటు లేదు" అంటూ చక్కాపోయాడు అరుణాచలం.

- పెండెం జగదీశ్వర్

కథ

వెంకట సుబ్బారావు కావూరి

అసలు గెలుపు...!

"చేశావులేవోయ్, బోడి వంట. అదేదే నువ్వొక్కదానివే చేస్తున్నట్లు నిక్కుడు, నీలుగుడూ". ఎగిరెగిరి పడ్డాడు శరత్‌బాబు తన భార్య సునీత మీద.

భర్త నోటి వెంట బోడి, నిక్కునీల్గుడూ మాటలు వినగానే సునీతకు కోపం తరతరాలుగా మహిళల్లో మండినట్లే మండింది.

"సరేనండి... ఆ బోడి వంటేదో మీరే చేసి భేష్ అనిపించుకోవచ్చుగదా?" ప్రశ్నించింది సునీత.

"ఏంటంట చేయలేననుకున్నావా?" శరత్ సవాలు యుగయుగాల పురుషతత్త్వంలాగే సర్రున దూసుకొచ్చింది.

"అయితే చేయండి" దొరికిన అవకాశాన్ని వినియోగించుకుంటూ రెచ్చగొట్టింది సునీత.

"మరి పందెమేంటి?"

"మీరే చెప్పండి" పందాన్ని నిర్ణయించే పని శరత్‌బాబు మీదే పెట్టింది సునీత.

"గెలిచిన వాళ్ళు ఏ కోరిక కోరినా తీర్చాలి సరేనా?"

"సరే" అంది సునీత టపీమని.

భర్తల గురించి ఇతరులకంటే భార్యలకే ఏ కొంచమయినా ఎక్కువే తెలుసన్న సూత్రం తెలిసిన శరత్‌కూ, రాతి యుగం నుంచి రాకెట్ వరకూ అన్ని విషయాలూ అంతో ఇంతో తెలిసున్న సునీతకూ మధ్య వారం రోజుల వ్యవధితో పెట్టుకున్న 'వంట పోటీ' మొదలయింది. ఆ పోటీ ప్రకారం శరత్‌బాబు వారం రోజులలో వంట నేర్చుకుని ఇంటిల్లిపాదికీ రుచిగా పెట్టాలి.

✪ ✪ ✪

పొయ్యి మీద బాణలిలో నూనె సలసల కాగుతోంది. 'వంటింటి ఘుమఘుమలు' పుస్తక పఠనంలో శరత్‌బాబు కూరుకుపోయాడు.

'పోపుకు పెట్టిన నూనె కాగిందో లేదో తెలుసుకోవాలంటే ఒక గింజ మినపప్పు వేసి చూడాలి. ఆ గింజ చుట్టూ నూనె కొద్దిగా పొంగుతూ అది కదులుతుంటే కాగినట్లు గుర్తించాలి' అని పెద్దగా చదివాడు. 'అదన్నమాట' అంటూ ఓ మినపప్పు గింజను నూనెలో వదిలాడు. తర్వాత మళ్ళీ పుస్తకంలో దూరాడు. 'నూనె కాగిన తర్వాత పోపు గింజల్ని నూనెలో వేయాలి'. ఆ పనీ పూర్తిచేశాడు. 'పోపు గింజలన్నీ ఎర్రబారిన తర్వాత ఒక రెబ్బ కరివేపాకు వేయాలి.' 'ఓహో ఇదొకటి కావాలి కదూ, మర్చిపోయానే? అనుకుంటూ దొడ్లోకి దారి తీశాడు. చేతికి అందిన కొమ్మను వంచి కరివేపాకు రెమ్మను తెంపుకొస్తుండగానే.....

"ఏంటి... ఏంటి? ఏమి జరిగిందండీ?" అంటూ పొగ కమ్ముకున్న వంటగదిలోకి దూసుకొచ్చింది సునీత.

ఏం జరిగిందో అర్థంకాక "పొయ్యావు, పొయ్యావు" అంటూ కేకలు వేశాడు శరత్‌బాబు.

ఆ వంటగదిలో అణువణువూ తెలిసున్న సునీత ఆ సమయంలో ఉంది కాబట్టి సరిపోయింది. లేకపోతే ఏంజరిగేదో ఊహించి గజగజ వణికిపోయాడు శరత్‌బాబు.

సునీత సరిగ్గా సిలిండరు బర్నరును కట్టేసే సమయంలోనే బాణలిలో నూనెకు నిప్పంటుకుంది. తన చీర చెంగును విసిరి దానిని కప్పేసింది సునీత. అంతే వేగంగా కదిలి దాన్ని పక్కనే ఉన్న నీళ్ళలోకి విసిరేసింది. అదే జరక్కపోయి ఉంటే అక్కడ పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది.

ఎంత ప్రమాదం తప్పిందో శరత్ కళ్ళారా చూశాడు. నోట మాట రాకుండా నిలువుగుడ్లేసిన శరత్‌బాబుని సునీత మంచం మీద పడుకోబెట్టింది. చల్లటి నీళ్ళిచ్చింది. తల నిమురుతూ స్వాంతన పరిచింది.

'పడి లేచిన వాడే నిజమయిన విజేత....' సునీత చెప్పిన ధైర్యవచనాలతో మిగిలిన ఆరు రోజుల్లోనయినా పోటీలో గెలవాలన్న తపనతో మళ్ళీ ప్రయోగాలు ప్రారంభించాడు. 'వంటింటి ఘుమఘుమలు' పుస్తకాన్ని ముందుగానే క్షుణ్ణంగా చదివేసి, ఆ తర్వాత వంట చేయాలని నిర్ణయించుకున్నాడు.

పుస్తకం తెరవగానే 'పాలు కాయండి ఇలా...' అంశం వచ్చింది.

'పుస్తకాలు చదివి మరీ పాలు కాయాలా?' అంటూ ఆశ్చర్యపోయాడు.

తానిచ్చిన 'ఆనంద్' సినిమాలాంటి మంచి కాఫీ తాగి సునీత, హార్లిక్సు తాగి పిల్లలూ తనను అభినందిస్తున్నట్లుగా ఊహించుకుంటూ గిన్నెలో పాలుపోసి పొయ్యిమీద పెట్టాడు. పాలు కాగేసరికి కూరల పాఠాన్ని కూడా చదివేస్తే టైమ్ కలిసొస్తుందని పుస్తకం తెరిచాడు. పొయ్యి సంగతే మరచిపోయాడు. పాలు పొంగి కాలువ కట్టాయి. అదేమీ గమనించకపోవటంతో గిన్నెలో మిగిలినపాలు కూడా ఆవిరయి నల్లగా చెక్కు కట్టింది. ఏదో తగలబడుతున్న ఘాటయిన వాసన గుప్పుమంటోంది. అప్పటిగ్గానీ శరత్‌బాబుకి అర్థం కాలేదు. వంట శాస్త్ర పుస్తక ప్రపంచం నుంచి బయటకు వచ్చి నాలిక్కరుచుకున్నాడు. స్టౌ ఆపుచేశాడు. కిందపడ్డ పాలను తుడుస్తుండగా, 'ఏమండీ కాసిని కాఫీ నీళ్ళిస్తారా?' అంటూ సునీత, 'నాన్నా హార్లిక్స్' అంటూ తనయుడు ఆదిత్య వంటగదిలోకి వచ్చారు. పాలన్నీ నేల పాలవటాన్ని చూసిన సునీత తట్టుకోలేక పోయింది. 'అయ్యయ్యో, ఏం పనండీ మీది?' అంటూ బాధపడింది. 'పాలన్నీ పోయినయ్యా? తిక్క కుదిరింది' అన్నాడు ఆదిత్య.

✪ ✪ ✪

"ఈ ఒక్క పూటకు తినండమ్మా" చిమిడి సంకటయిన అన్నాన్ని తినలేక పళ్ళాలను నెట్టేసిన పిల్లలను బతిమలాడుతున్నాడు శరత్‌బాబు.

"కావాల్సుంటే నువ్వే తిను...మాకేమొద్దు ప్పొ" ఎదురుతిరిగింది కూతురు రమ్య.

"సరేరా, మీ అమ్మను పిలవండి, హోటలుకెళదాం" చేసేది లేక రాత్రి తొమ్మిది గంటలవుతుండగా శరత్‌బాబు ప్రతిపాదించాడు.

తన భర్త ఓడిపోతున్నాడని సంతోషించాలా? తనను తానే ప్రశ్నించుకుంది సునీత. అదే జరిగితే శరత్‌బాబు ఇక వంటజోలికే పోడు. అలా జరగ్గూడదనుకుంది. తాను ఓడిపోయినా పోయేదేమీ లేదు. కొందరినయినా ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున భర్త ఓడిపోకూడదని అనుకుంది. అది ఎందరెందరికో ఉపయోగపడుతుందని విశ్లేషించుకుంది. ఆఫీసుకు వారం రోజులు సెలవు పెట్టింది. భర్త వెనకే ఉండి ముద్దుమురిపాలు కలబోసి శరత్‌బాబు చేత గంటె తిప్పించింది.

✪ ✪ ✪

"చేయాలన్న తపన ఉంటే చాలు మగవాళ్ళు వంటలు చేయొచ్చు...ఆడవాళ్ళు రాజ్యాలేలనూవచ్చు" విశ్లేషిస్తున్నట్లు ఫోజుపెట్టి అంది సునీత.

"దేవిగారు పట్టుబట్టి మరీ తన మొగుడ్ని గెలిపించుకున్నారుగదా మరి ఒప్పందం ప్రకారం కోరిక కోరరా?" ఎన్టీఆర్ డైలాగులా అన్నాడు ఆ రాత్రి వేళ శరత్‌బాబు.

"ఎందుకు కోరమండీ వంట నేర్చిన మొగుడుగారూ." గోముగా పలికింది సునీత.

"ఏమిటో మీ కోరిక. చెప్పండి తీర్చెదము' నడుముపై కుడి చేతినుంచి ఎడమ చేతిని తిప్పుతూ అడిగాడు.

"ఏముంది స్వామీ, మగవాళ్ళు కూడా వంటింటి పనుల్లో సాయం అందిస్తే ఆ కాపురం మూడు కూరలు, ఆరు రుచులన్నట్లుగా సాగిపోతుందని మీకు తెలిసిన మగవాళ్ళందరికీ నచ్చచెప్పండి చాలు."

"ఆఆఆఆహా అలాగా... " దీర్ఘం తీశాడు వంటపోటీ విజేత శరత్‌బాబు.

అసలుగెలుపు పొందిన సునీత మాత్రం గుంభనంగా "ఆ అవునూ...అచ్చం అలాగే..." అని తిరిగి దీర్ఘంతీసింది. గెలుపెవరిదో అర్థంకాకపోయినా పిల్లలిద్దరూ చప్పట్లు కొట్టారు.

టీనేజిలో చదువు రాక పోతే?

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్.

ఫోన్ : 9849130141

చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు సరిగ్గా చదువు రావడం లేదని ఆందోళన పడుతుంటారు. దీనిని సైకలాజికల్ గైడెన్స్ & కౌన్సిలింగ్ వల్ల కొంతమేరకు నివారించగలం. చాలా కేసులలో... ఇది సాధ్యం కాదు. కారణం బాల్యంలో ఏర్పడిన కాంప్లెక్సులు వీరి మనస్సుల్లో బలంగా పాదుకోవడం. మీ పిల్లలలోనూ ఈ పరిస్థితి తలెత్తిందా? 'మొదటి ర్యాంకు తెచ్చుకో' అని వారిని బలవంతం చేయకండి. వారు దారితప్పే ప్రమాదముంది. మధ్యేవాదాన్ని అవలంబిస్తూ వారిని చక్కదిద్దే ప్రయత్నం చేయొచ్చు. పిల్లలకున్న వైజ్ఞానిక అవగాహన మేరకు వారు ఏదో ఒక కెరీర్‌ను ఎంచుకునేలా చేయొచ్చు. ఉన్నత చదువులు లేనంత మాత్రాన దేన్లోనూ సత్తా లేనట్టేనా?

దిగులెందుకు...?

చదువులంటే... ఇంజనీరింగ్, మెడిసిన్లేనా? మామూలు చదువులతో ఒక్కో మెట్టూ పైకెదగలేమా? సాధారణ అర్హతలున్నా.... ప్రత్యేక నైపుణ్యాలతో దూసుకుపోవచ్చు. అలా పైకెదుగుతున్న వారి సంఖ్య ఇప్పుడు పెరుగుతోంది. ఏ చిన్న అవకాశాన్నైనా అందుకొని, ఆపై అల్లుకుపోవడమే నేటి తరం నైజం. కొందరు విద్యార్థుల్లోనే కాదు, తల్లిదండ్రుల్లోనూ ఈ రోజున్న భావన ఒకటే... ఇంజనీరింగ్, మెడిసిన్లలో సీటు రాకపోతే ఆ జీవి మరెందుకూ పనికి రాదు! ఫలితం ఏమాత్రం తారుమారైనా బంధువులు మన పాలిట రాబందులైపోతారు. 'అయ్యో పాపం. ఏం చేస్తాం... నీ మొఖాన చదువు రాసి పెట్టిలేదు...' అని నీరుగారుస్తారే గానీ 'ప్రపంచం విస్తారమైంది. నీలో ఉన్న ఇతర నైపుణ్యాలను ప్రయోగించు. హాయిగా బతకొచ్చు' అని వెన్నుతట్టేవారు తక్కువే. ఇక బీఏ, బీకాంలలో చేరేవారి పాట్లు దేవుడికెరుక. తెలుగు మీడియమైతే మరీనూ! గమనించి చూడండి. ప్రొఫెషనల్ కోర్సుల వాసనే తెలీయకుండా గొప్ప పేరు తెచ్చుకున్నవారున్నారు. యువతరం ఆరాధ్య దైవం రెహమాన్నే తీసుకోండి... ఆయన సంగీతానికి చదువుతో పనేముంది? క్వాలిఫికేషన్లేమీ లేకుండా ప్రతి రంగంలోనూ తమదైన ముద్ర వేసినవారు చాలా మందున్నారు.

ఎన్నో మార్గాలు...

అర్హతలతో పనిలేని కొత్త అవకాశాలెన్నో ఉన్నాయి. అభిరుచికి సృజనాత్మకత తోడైతే చాలు. మీ రూపం, గొంతు, మాట తీరు, మీకొచ్చిన వంట, సంగీతం, కరాటే... ఇలా చదువుతో సంబంధం లేని ఎన్నో విషయాలు కొత్త ఉపాధికి బాటలు వేస్తాయి. ఆలోచిస్తే ఎన్నో అవకాశాలు... ఏ ఒక్కదాన్ని ఒడిసి పట్టుకున్నా ఉద్యోగస్తుల్లా నెల తిరిగే సరికి కనీసం మూడు, నాలుగు వేల రూపాయలు మీ ఒళ్లో గలగలమంటాయి. ఆపై మీ చొరవ... ధైర్యం! జనమందరిలో మనమెవరన్న గుర్తింపునూ, సంపాదననూ కూర్చుకోవాలంటే ;మన సహజ గుణాలను మెరుగుపరుకోవాలి మరి.

అవరోధాలు... మామూలే!

తక్కువ మంది నడిచే బాటలో నడవాలనుకొన్నప్పుడు మార్గం కొత్తగానే ఉంటుందని గుర్తు పెట్టుకోండి. అలాంటి దారిలో నడిస్తేనే వైవిధ్యం సొంతమయ్యేది. కొత్తను వింతగా చూసే వారూ, ఎగతాళి చేసేవారూ, భయపెట్టి వెనక్కి లాగే వారూ ఎప్పుడూ ఉంటారు. తానుంటున్న ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ వాసులకు కరెంటు, వాటర్ బిల్లులు కట్టడం, వెచ్చాలు, కూరలు తేవడం లాంటి పనుల్లో బిజీగా ఉంటాడు విజయ్. 'ఇదేం పని'అని మొదట్లో హేళన చేసినవారే... ఇప్పుడు తనను సలహాలడుగుతున్నందుకు సంతోషంగా ఉందంటున్నాడు.

బిల్డింగులు కట్టలేక పోయినా..... ముందునుంచీ నా కోరిక ఇంజనీర్ కావడం. ఆర్థిక పరిస్థితి వల్ల పదో తరగతితోనే ఫుల్‌స్టాప్ పెట్టాల్సొచ్చింది. ఆ పరిస్థితుల్లో నాకేం చేయాలో తోచలేదు. ఐతే అది కొన్నాళ్లే... ఆ తరువాత లాండ్ స్కేపింగ్ వైపు నా దృష్టి మళ్లింది. పచ్చదనం వెల్లివిరిసే 'లాన్'ల ఏర్పాటుతో ఉపాధి పొందవచ్చనిపించింది. గ్రాస్ వరల్డ్‌లో చేరాను. లాన్ పెంపకానికి సంబంధించి అధ్యయనం చేశాను. సొంతంగా నేనే ఓ నర్సరీ పెట్టాను. పగలూ రాత్రీ కష్టపడ్డాను. రోజు 15 కిలోమీటర్లు నడిచేవాణ్ని. అలా నాలుగేళ్లు శ్రమపడ్డాక అందులో స్థిరపడ్డాను. ప్రస్తుతం... ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు వచ్చినంత ఆదాయం నాకూ వస్తోంది. పగలంతా కష్టపడినా రాత్రి పడుకొన్నాక అంతులేని సంతృప్తితో మనసు నిండిపోతుంది. ✱

సెన్సూ... కామన్ సెన్సు

గ్రామ వేదం

పారుపల్లి వెంకటేశ్వరరావు

"పల్లెకు బోదాం పైరులు చూద్దాం చలో చలో" అంటూ వినయకుమార్ ఉత్సాహంగా నా దగ్గరికి వచ్చాడు.. వాడు మా చిన్నత్త కొడుకు. బావా ! తాతయ్య ఈ రాత్రికే మనం వూరు వెళ్లటానికి బస్సు టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకొచ్చాడు. అన్నాడు.

నేను అమెరికా నుండి వచ్చి మూడు రోజులైంది. అమెరికాలో నేను చదివేది పన్నెండో తరగతి. హైదరాబాద్‌లో వినయ్ చదివేది ఎనిమిదో తరగతి. నేను తాతయ్యకి పౌత్రుణ్ణి ! కొడుకు కొడుకుని ! వినయ్ దౌహిత్రుడు. అంటే కూతురు కొడుకు !

గ్రామీణ వాతావరణాన్ని, శ్రమ జీవులైన కర్షకుల జీవన విధానాల్ని, పొలాల్లో పైరుల్ని మాకు చూపించారు. అహ్లాదకరమైన వాతావరణం, పచ్చ దనంతో కళకళలాడే ప్రకృతి శోభ పట్టణాల్లో పుట్టి పెరిగిన మాకెంతో ఆనందం కల్గించింది. అలా పొలాల్లో పైరులు చూసి తిరిగి వూరులోకి వచ్చాం. దారిలో వున్న హరిజన పల్లెలో ఒక దృశ్యం చూసి ఆగిపోయాం.

ఒక యువతిని అయిదుగురు మహిళలు చుట్టుముట్టి ఉన్నారు. ఒకామె చీపురు కట్ట చేత బట్టి ఆ యువతిని బాదుతూ, "పోవే ! దొంగముండా ! దిగిపోవే! దిగిపో!" అంటూ వుంది. ఆ యువతి భర్త పక్కనే నిలిచి బిక్క మొకంతో చూస్తున్నాడు గానీ ఏం అనలేకపోతున్నాడు.

"ఆగు కోటమ్మ ! ఎందుకు అచ్చమ్మని కొడుతున్నావు!" అని తాతయ్య గద్దించి అడిగాడు. కోటమ్మ ఆ గద్దింపుతో తెల్లబోయి కొట్టటం ఆపింది.

పక్కనే వున్న మరో మహిళ తాతయ్యతో, "అచ్చమ్మకి దెయ్యం పట్టిందండీ! చీపురు కట్టతో కోటమ్మ దాన్ని దించుతుంది". అన్నది. "పక్క ఊళ్లో అచ్చమ్మ కూరగాయలు అమ్మి వస్తుంటే దారిలో చింతచెట్టు మీద వుంది గామోలు దొంగముండ పట్టుకుంది. ఎండలో బడి ఇంటి కొచ్చి కళ్లు తేలేసి తిక్క తిక్కగా జూస్తంది. కోటమ్మని బిలిసి దెయ్యాన్ని దింపిస్తన్నం" ! అంది మరొక మహిళ.

"మరియమ్మా ! అచ్చమ్మకేం దెయ్యం పట్టలేదు. ఆ మూఢ నమ్మకం మీకు పట్టుకుంది. పొద్దుటి నుండి తట్ట నెత్తినబెట్టుకొని కూరగాయలు ఇంటింటికి తిరిగి అమ్మిందా.. మళ్లీ ఆ ఎండలోనే తిరుగు ప్రయాణం కదా... అలసి, సొలసి తల తిరిగి ఉంటుంది. అలాంటి మనిషిని దెయ్యం పట్టిందని చావబాదుతారా ! ముందు ఆమెకి చల్లటి మంచి నీళ్లు తాగించండి ! తరువాత మజ్జిగలో కొంచెం ఉప్పు, పంచదార కలిపి తాగించండి! చన్నీళ్ళతో స్నానం చేయించి పడుకోబెట్టండి ! ఆమెకి లేని పిచ్చి యెక్కించకండి"! అన్నాడు తాతయ్య.

అక్కడి నుండి వచ్చేస్తూ, "తాతయ్య ! అసలు దెయ్యాలుంటాయా ? అమెరికాలో కూడా దెయ్యాల కథలు చెబుతుంటారు". అని అడిగాను.

నాన్న జయంత్ ! అంతరిక్ష విజ్ఞానం గురించి ఎసిమోవ్ అనే శాస్త్రవేత్త రచనలు ఆసక్తిగా చదువుతావుగదా ! అలాంటి నువ్వు ఊహాజనితమైన దెయ్యాల కథలు నమ్మగూడదు అన్నాడు తాతయ్య.

తాతయ్య ! నువ్వు మాకు భారతం కథలో అరణ్య పర్వంలో గాలవుడు అనే ముని పాండవుల్ని చంపటానికి భూతాన్ని సృష్టించి పంపాడని చెప్పావుగా ! అన్నాడు వినయ్. నేనూ అదే అడిగాను.

వినయ్ మీకు నేను ఆ కథ చెప్పాను. కాని దెయ్యాలుంటాయని చెప్పానా? భారతంలో అది నీతి కథ. "చెరపకురా చెడేవు! ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారు" అనే నీతిని ఆ కథ చెబుతుంది. అతడు సృష్టించిన భూతానికి అతడే ఆహుతి అయ్యాడు అనే సందేశంతో ఆ కథ రచన జరిగింది. అంతేకాదు. ఒక్కొక్కసారి కొన్ని ఘటనలు దెయ్యాలున్నట్లే జనాన్ని భ్రమింపజేస్తాయిరా! అటువంటి కథ చెపుతాను!

నరసింహం అని నాకొక మిత్రుడున్నాడు. నాకు, అతనికి దెయ్యాలన్నా, చిల్లరదేవుళ్ల మహిమలన్నా నమ్మకాలు లేవు. ఒక రోజున నరసింహం ఏదో పని మీద చెల్లెలు గారి వూరెళ్లాడు. పని చూసుకొని ఆ రాత్రి అన్నం తిని వెంటనే తిరుగు ప్రయాణం అయ్యాడు. అన్నయ్య ! రాత్రిపూట ప్రయాణమెందుకు ! అన్నది. రేపు నాకు అత్యవసరమైన పని ఉంది. రాత్రి పూట నాకేం భయం లేదు అని బాణాకర్ర తీసుకొని బయలుదేరాడు. రెండు గ్రామాల మధ్య అతడు వచ్చే దారి పక్కనే బాగా ఎదిగి పాల గింజల కుంకులతో వున్న సజ్జ చేను వుంది. ఆ చేను మధ్యలో పైరులో నుండి మంట పైకిలేచింది. అతను చూస్తూ వుండగానే మంట కిందికి పోయింది. మళ్ళీ పైకి వచ్చింది. అలా మంట కిందకి, పైకి పోతూ ముందుకు సాగుతూవుంది. మంటలో పొగకూడా వుంది. ఆ దృశ్యం నరసింహానికి ఆశ్చర్యంగా వుంది. పైరు మధ్యలో మంట పైకి కిందికి లేస్తూ ముందుకు పోయే దృశ్యం కొరివి దెయ్యాల కథల్ని గుర్తుకు తెస్తూ ఉంది. దెయ్యాలు లేవని వాదించే నరసింహానికి అనుమానం కల్గించింది. భయపడి వెనక్కిపోతే చెల్లెలు దయ్యాలే లేవని వాదించే వాడివిగా ! ఇప్పుడు తెలిసొచ్చిందని ఎగతాళి చేస్తుంది. ఊరువాళ్లూ నవ్వుతారు. నరసింహం బలశాలి, ధైర్యశాలి. తెగించి ముందుకేసాగాడు. అతడు చేను పక్కకి వచ్చేసరికి చేలో నుండి ఒక మనిషి దివిటి చేత బట్టుకొని బయటికి వచ్చాడు. నరసింహాన్ని పలకరించాడు. ఏంటిబాబూ ! రాత్రి పూట ప్రయాణం చేస్తున్నావు ? అన్నాడు,.

"నాకేదో తొందర పని వుండి వెళ్తున్నాను గానీ చేతిలో ఈ దివిటీతో తిరుగుతున్నావెందుకు ? నువ్వు అన్నాడు నరసింహం. ఓహూ అదా ? సజ్జ చేలో కుంకుల మీద దోమ ఆడతంది ! దివిటీ తిప్పితే దోమపోటు తగ్గుతుందని మునుములు పట్టి తిప్పుతున్నాను" అన్నాడు రైతు.

ఔరా ! నేను భయపడి వెనక్కిపోయి కొరివి దెయ్యం కనపడిందని చెబితే అందరూ నమ్మే వాళ్లే గదా ! నేను ధైర్యంచేశాను గనుక నా మాట అందరూ నమ్మే వాళ్లే ! దివిటీయే కొరివి దెయ్యం అయ్యేది. దెయ్యాల కథలన్నీ ఇలాంటి భ్రమలే అనుకున్నాడు నరసింహం..

అదీ కథ జయంతూ ! ఏ విషయమైనా తర్కించి ఆలోచించాలి. ఎవరో ఏదో చెబితే గుడ్డిగా నమ్మగూడదు! మనకు సెన్సుంటుంది. కామన్‌సెన్సుంటుంది. నరసింహం లాగా ధైర్యంగా నిలిచి పరిశీలించాలి ! నిజం తెలుసుకోవాలి ! మన పూర్వ ఋషులు అలానే ప్రకృతిని, పరిణామాల్ని, పరిశీలించి, స్వయంగా తెలుసుకున్న విషయాల్ని అక్షర బద్ధం చేశారు. అవే వేదాలు అన్నాడు తాతయ్య. ఇప్పుడు మాకు తాతయ్య స్వానుభవంతో చెప్పింది "గ్రామవేదం". నిజమైన కామన్‌సెన్స్! ✻

ఓ ఊరి కథ

బి.సుధాకిరణ్

నాటి బిలంకొండే...

బెల్లంకొండ

ప్రతి ఊరికీ ఒక చరిత్ర ఉంటుంది. వింటుంటే చాలా విచిత్రమనిపిస్తుంది. కొంత కాలానికి ఆ చరిత్ర అంతరించిపోతుంది. దాని గుర్తులను విడిచి వెళుతుంది. గతకాలపు పొరలకింద దాగిన ఈ చారిత్రకాధారాలను పట్టుకుంటే ఆ ఊరి పుట్టు పూర్వోత్తరాలు ఇట్టే తెలిసిపోతాయి. గ్రామాల చరిత్రనూ, వాటి నామాల నేపథ్యాన్నీ వివరించే చిన్న ప్రయత్నమే ఈ 'గ్రామనామం'.

గుంటూరు జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాల్లో పెదకూరపాడు నియోజకవర్గంలోని బెల్లంకొండ... కృష్ణానది దక్షిణ తీరంలో విస్తరించిన ప్రాంతం. చుట్టూ చిట్టడివి... నల్లని కోటగోడల్లా నిలిచివున్న కొండలు... దుప్పుచెట్లు... రాతిమయమైన నేలతో బెల్లంకొండ చూడటానికి చాలా ఆహ్లాదభరితంగా ఉంటుంది. దీని చరిత్ర పురాతనమైనది. ఇతిహాస కథలతో ముడిపడి, రాచరిక పాలనతో కళకళలాడిన ప్రదేశమిది.

నాడు 'బిలం'కొండ

ఒకనాడు ఈ గ్రామాన్ని బిలంకొండగా పిలిచేవారు. కొండమీది భౌగోళిక స్థితిని బట్టి, ఈ ప్రాంతం బిలం, దొన, ఎత్తయిన శిఖరాలతో దుర్గమారణ్యంగా ఉండేది. అందుకే దీనిని 'బిలం'కొండగా పిలిచేవారు. ఈ కొండ మీద నుండి చూస్తే... కృష్ణానదీ ప్రవాహం కనులవిందు చేస్తుంది. ఆనందంతో మనిషిని తన్మయత్వంలో పడేసే పచ్చనిచెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం, బండలలో నుండి ఊరే స్వచ్ఛమైన నీరు ఇప్పటికీ ఇక్కడున్నాయి. ఏకాగ్రతకు, ప్రశాంతతకు నిలయంగా ఉన్న ఈ ప్రదేశంలో భృగుమహర్షి ఆశ్రమాన్ని నెలకొల్పాడనీ, తపస్సును ఆచరించాడనీ చరిత్ర చెబుతోంది. ఆయనతోపాటు మరెందరో ఋషులు, తపస్సంపన్నులు ఈ కొండమీది గుహల్లో తపస్సు చేసినట్లు చారిత్రకాధారాలున్నాయి.

ఇతిహాసాలలో...

బిలంకొండ నుండి బెల్లంకొండగా మారిన ఈ ప్రదేశం ఇతిహాసాల్లోనూ స్థానాన్ని దక్కించుకుంది. బిలంకొండను ఏకచక్రపుర అగ్రహారంగా ఇతిహాసాల్లో వ్యవహరించారు. మహాభారత కాలంనాటి పుటలను తిరిగేస్తే... పాండవులు అరణ్యవాసం చేస్తూ కొంతకాలమిక్కడ నివసించారనీ, అప్పట్లో బ్రహ్మణ వేషధారులై ఒక బ్రాహ్మణోత్తముని ఇంట ఆశ్రయం పొందారనీ తెలుస్తోంది. ఈ కొండమీద బకాసురుడు అనే రాక్షసుడు అగ్రహారీకులను బాధించేవాడనీ, భీమసేనుడు అతనిని సంహరించాడనీ ఇక్కడి ప్రజలు నమ్ముతారు. ఈ నమ్మకానికి గుర్తుగా బిలంకొండకు అతి సమీపంలో బకాసురుని గుట్ట, భీముని తిప్ప అనే ప్రదేశాలు సాక్షాత్కరిస్తాయి.

నామ నేపథ్యం

క్రీ.శ. 1420లో ఈ ప్రాంతాన్ని కొండవీడును పాలించిన రెడ్డిరాజులు హస్తగతం చేసుకున్నారు. బిలంకొండ ఉచ్ఛారణలో మార్పుచెంది బెల్లంకొండగా మారిందని ఈ గ్రామానికి చెందిన పలువురు తెలిపారు. రెడ్డిరాజులు తమ హయాంలో బెల్లంకొండపైన పెద్దకోట నిర్మించినట్లు శిథిలాల ద్వారా తెలుస్తోంది. కొండకిరువైపులా కనిపించే బురుజులు, స్వాగతం పలుకుతున్నట్లున్న దర్గా, కొండపైన విశాలమైన ప్రదేశం నేటికీ కనిపిస్తాయి. వీటితోపాటు సర్వమత సామరస్యానికి దర్పణం పట్టే హైందవ, ముస్లిం ప్రార్థనామందిరాలు, బండలపై గల రథచక్ర గుర్తులు నేటికీ దర్శనమిస్తాయి.


కొండపై కోటలోకి స్వాగతం పలికే రాతి దర్గా

మరిప్పుడో...

బెల్లంకొండ 1952లో పంచాయితీగా ఏర్పడింది. మొత్తం జనాభా ఐదువేలు. గ్రామానికి తూర్పున కొత్తపాలెం, ఉత్తరాన బెల్లంకొండ, దక్షిణాన నందిరాజుపాలెం, పడమరన మాచాయపాలెం సరిహద్దులుగా ఉన్నాయి. ఇక్కడి ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. గ్రామ పరిధిలోని సాగుభూముల్లో వరి, పత్తి, మిరప పంటలు పండుతున్నాయి.

ఈ బెల్లంకొండ చిన్న పంచాయితీగానే మిగిలినప్పటికీ గత చరిత్రకు గుర్తులుగా నిలిచిన కట్టడాలు ఇప్పటికీ కనువిందు చేస్తాయి. ఎంతో పెద్దవిగా ఉండే పురాతన దేవాలయాలు, వీర్లచావిళ్లు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ✻


సర్వమత సహనం... కొండపైన హైందవ, ముస్లింల దేవాలయం



అవీ... ఇవీ

మనిషిని రూపొందించాలంటే...
శ్రమ...శ్రమ...శ్రమే!
మరి మనిషితనాన్ని...?!
శ్రమైక జీవన సౌందర్య సంస్కృతే!



హలో...హల్లో

ఆగండి నన్నెవరూ తాకకండి
ఒక క్షణం ఫోన్‌లోని మాట
గుండెకు ఆక్సిజన్‌లా అందే వరకూ...
నన్నెవరూ తాకకండి

నిరంతరం మనసున నిండిన గ్రీష్మం
ఆ మాటతో వసంతమవుతుంది
అందుకే నన్నెవరూ తాకకండి.

ఆగిపోయిన అవయవాలన్నీ
ఇపుడే ప్రాణం పోసుకున్నాయి
ఇదిగో పక్షవాతం సోకిన చెయ్యి కాస్తా
కొద్దిగా అటూ ఇటూ కదులుతుంది.

నిద్దుర వెలివేసిన ప్రతిరాత్రి
నేను దు:ఖవర్షాన్నయ్యిందీ
క్షణాలు గుండు సూదులై గుండెను గుచ్చుకున్నా
ఆలోచనలతో అగ్నిగోళాన్నయ్యిందీ
ఆ మాట కోసమే కదా...!

మాట ఒక పాట
మాట ఒక తూటా
మాట కొందరికి ప్రాణం కూడా ...!
హలో అన్నతర్వాత ఏరా కన్నా అన్న ఆ మాట
అమ్మ చనుబాల లాంటి మాట విన్నాను
వేయి పుష్పాల విరబూసిన కొమ్మనయ్యాను
ఇక నన్నెవరైనా తాకవచ్చు.

-నూకపంగు వెంకయ్య



కూతురికి వయసొస్తే......!

తన కుమార్తె బాల్యం నుండి యవ్వనంలోకి అడుగుపెట్టిన సందర్భంగా అమెరికాలోని ఒక ధనవంతుడైన తండ్రి చేసిన ఖర్చెంతో తెలుసా 60 లక్షల పౌండ్లు. పౌండు విలువ మన రూపాయల్లోకి మార్చుకుంటే 48 కోట్ల రూపాయలకు పైమాటే. డేవిడ్ బ్రూక్స్ అనే పెద్దమనిషి(50) న్యూయార్క్‌లోని రాక్‌ఫెల్లర్ సెంటర్ 65వ అంతస్తులో ఉన్న రెస్టారెంట్‌లోని రెయిన్‌బో రూమ్‌లో పార్టీ ఇచ్చాడు. యూదుమత ఆచారం ప్రకారం తన కుమార్తె యుక్తవయస్కురాలైనట్లు తెలిపే ఈ కార్యక్రమం కొంతమందికి వినోదం కలిగించింది. తన కుమార్తె వయస్సువారు 150 మందికి మరో 150 మంది పెద్దలను విందుకు ఆహ్వానించాడు. ఆటగాళ్లు, పాటగాళ్లకు భారీ మొత్తంలో వెచ్చించారు. డేవిడ్‌కు ఈ ఖర్చు చిల్లర వంటిది. బుల్లెట్ ప్రూఫ్ దుస్తులను తయారు చేసే కంపెనీ సిఇఓ అయిన డేవిడ్ గతేడాది 4.4 కోట్ల పౌండ్ల వేతనం, ఇతర ఆదాయం పొందాడట. అలాంటి వాడికి 60 లక్షల పౌండ్లు చిల్లర ఖర్చు గాక మరేమిటి?

-ఎంకెఆర్

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

మనిషి మెదడు హింసాపూరితమవుతోందా?

గత ఏడాది బ్రిటన్‌లో 14 ఏళ్ల విద్యార్థిని తోటి విద్యార్థి కాల్చి చంపాడు. 1999లో అమెరికాలోని కొలరాడోలోని లిటిల్‌టన్ పట్టణంలో ఇద్దరు టీనేజ్ కుర్రాళ్లు హైస్కూలులోకి ప్రవేశించి బాంబులు, కత్తులు, తుపాకులతో 13 మంది విద్యార్థులను ఊచకోత కోశారు. తరువాత ఆ ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. 1997 నుండి 2004 వరకు అమెరికాలో ఇటువంటి హత్యాకాండలు 12 జరిగాయి. 2002 ఏప్రిల్‌లో జర్మనీలోని ఎర్‌ఫర్ట్‌లో 19 సంవత్సరాల యువకుడు తుపాకి పట్టుకుని స్కూల్లో 20 నిమిషాల సేపు విచ్చలవిడిగా కాల్పులు జరిపితే 17 మంది చనిపోయారు. అతనూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇవన్నీ పశ్చిమ దేశాల యువకుల్లో పెరిగిపోతున్న హింసాప్రవృత్తికి నిదర్శనాలు. యువకుల్లోనే కాదు పెద్దల్లో కూడా హింసా ప్రవృత్తి బాగా పెరిగిపోతోందని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మన దేశంలో కూడా ప్రజల్లో ముఖ్యంగా యువతరంలో హింసా ప్రవృత్తి ఇటీవలి కాలంలో పెరిగిపోతున్నదనడానికి అనేక ఉదాహరణలు కనిపిస్తున్నాయి.

ఆధునిక కంప్యూటర్లు, టీవీలూ మనిషి మెదడును హింసాపూరితం చేయడమే దీనికి కారణమని ఇటీవల జరిపిన అనేక పరిశోధనల్లో తేలింది. ముఖ్యంగా అమెరికాలో ఉత్పత్తి అవుతున్న వీడియో గేముల్లో సగానికి సగం పూర్తిగా హింసా కాండతో నిండి ఉండడం, టీవి కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున హింసాకాండను చూపిస్తుండడం వల్ల మనుషుల మెదళ్లలో క్రమంగా మార్పులొస్తున్నాయని, మానవుని మెదడు రానురాను హింసాయుతం అవుతోందని అనేకమంది శాస్త్రవేత్తలు చెప్పడమే కాదు, అనేక పరిశోధనల ద్వారా నిరూపిస్తున్నారు.

మనిషి చూసే హింసాత్మక ఘటనలు అతని మెదడులో మార్పులు తెస్తాయా? కేవలం సామాజిక అంశమైన హింసా ప్రవృత్తికీ మానవుని జీవన క్రియలతో సంబంధం ఉంటుందా? అన్న మీమాంస శాస్త్ర ప్రపంచంలో ఇప్పటికీ ఉంది. నిజానికి నిన్నటి వరకు ఇది కేవలం సామాజిక అంశం. దీనికీ మెదడు నిర్మాణానికీ సంబంధం లేదు అని చెప్పే శాస్త్రవేత్తల సంఖ్య అధికంగా ఉండేది. కాని ఇటీవలి కాలంలో రానురాను మరింత మంది శాస్త్రవేత్తలు వీడియోగేములు, హింసాత్మక టీవీ, సినిమా కార్యక్రమాలు మనిషి మెదడును హింసాత్మకం చేస్తున్నాయని శాస్త్రీయంగా నిరూపించడం ప్రారంభించాక పై విషయాన్ని నమ్మని వారి సంఖ్య తగ్గిపోతూ వస్తోంది.

మెదడు మడతల్లో ఏం జరుగుతుంది ?

అమెరికాలోని మిస్సోరి-కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన మానసిక శాస్త్రవేత్త బ్రూస్ బార్తోలో తన సహచరులుతో కలిసి కొంతమంది వ్యక్తులమీద పరిశోధనలు జరిపాడు. మనిషి మెదడులో భావోద్వేగాలను కొలిచే మానాన్ని 'పి300 రెస్పాన్స్' అంటారు. ఒక ఉద్విగ్నమైన సన్నివేశాన్ని మనం చూసినప్పుడు మెదడు పి300 రెస్పాన్స్ ఎక్కువగా ఉంటుంది. ఈ ఉద్వేగ సంకేతాలను ఎలక్ట్రో ఎన్‌సెఫాలో గ్రామ్ (ఇఇజి)తో కొలుస్తారు. నిత్యం వీడియో గేములు ఆడే 39 మందిపై ప్రయోగాలు జరిపాడు. మామూలు చిత్రాలు చూపిస్తూ, వెనువెంటనే హింసాత్మక ఘటనలను చూపించడం అప్పుడు మెదడులోని పి300 రెస్పాన్స్‌ను కొలవడం చేశాడు. ఆయన పరిశోధనలో తేలిందేమంటే నిత్యం వీడియో గేములు ఆడే వారిలో మామూలు ఘటనకూ, హింసాత్మక ఘటనకూ మధ్య తేడా పెద్దగా కనిపించలేదు. వీడియో గేములు ఆడని వారిలో హింసాత్మక ఘటనలు చూడడంతోనే పి300 రెస్పాన్స్ పెరిగింది. అంటే నిత్యం హింసాత్మక వీడియోగేములు చూసే వారి మెదళ్లు హింసపట్ల ప్రతిస్పందన కోల్పోయాయని (డిసెన్సిటైజ్) బార్తోలో కనుగొన్నాడు. ఇట్లా డిసెన్సిటైజ్ అయిన వారు హింసాత్మకంగా మారుతారని అతడు చెప్పాడు. నిజానికి అమెరికా సైన్యం యుద్ధంలో పాల్గొనే సైనికులతో హింసాత్మక వీడియోగేములు ఆడించడం ద్వారా యుద్ధం పట్ల 'డిసెన్సిటైజ్' చేస్తుంది.



వీడియోగేములు, హింసాత్మక సినిమాలు, టివి కార్యక్రమాలు చూడని వారి కన్నా వీటిని నిత్యం చూసే వారిలో హింసా ప్రవృత్తి చాలా అధికంగా ఉంటుందని చాలా రకాల పరిశోధనలు తెలిపాయి. ఇటువంటి వారు ఇతరులపై ఊరికినే దాడికి పాల్పడతారని, హింసాకాండకు పూనుకుంటారని తేలింది. "హింసాత్మక వీడియో గేముల వల్ల దుందుడుకు తనం, హింసా ప్రవృత్తి పెరుగుతుందని మానవుల ప్రవర్తనపై జరిపిన అనేక పరిశోధనలు తెలిపాయి" అని అమెరికాలోని ఐయోవా స్టేట్ యూనివర్సిటీకి చెందిన క్రయిగ్ ఆండర్సన్ చెప్పాడు. వీడియో గేములు ఆడుతున్న, హింసాత్మక కార్యక్రమాలు చూస్తున్న వారి మెదడులో వాస్తవంగా ఏం జరుగుతోందో తెలుసుకోడానికి జర్మనీలోని ఆచెన్ విశ్వవిద్యాలయానికి చెందిన క్లాస్ మాథియాక్ అనే మేధావి ఒక ప్రయోగం చేశాడు. 18, 26 ఏళ్ల మధ్య వయసు గల 13 మందిని తీసుకున్నాడు. వారు ప్రతి రోజూ 2 గంటలు వీడియోగేములు ఆడుతారు. వారు గేము ఆడుతున్న సమయంలో మెదడును ఎంఆర్ఐ స్కాన్ చేశాడు. మాథియాక్ గేములోని సీన్ నుండి సీన్‌కు మెదడు ఎలాంటి మార్పులకు లోనవుతోందో పరిశోధించాడు. దీని నుండి ఆయన తేల్చినదేమంటే హింస తప్పదనుకున్నప్పుడు మెదడులోని జ్ఞాన సముపార్జనా భాగాలు చాలా చురుకుగా పనిచేస్తాయి. యుద్ధం వచ్చిన తరువాత 'అమిగ్దాలా' 'సింగులేట్ కార్టెక్స్' వంటి భావోద్వేగ భాగాలు చురుకుగా పనిచేస్తాయి. ఈ పరిశోధనల ఆధారంగా ఆయన తేల్చినదేమంటే వీడియోగేము మనుషుల్లో హింసా ప్రవృత్తి పెంచుతుంది అని. వీడియోగేములే కాదు, హింసాత్మక సినిమాలు, టివి కార్యక్రమాలు, నిజజీవితంతో హింసాత్మక ఘటనలు జరిగేటప్పుడు కూడా ఇటువంటి పరిణామాలే సంభవిస్తాయని ఇతరత్రా జరిగిన అనేక పరిశోధనలు తెలియజేస్తున్నాయి. అందుకే హింసాత్మక వీడియోగేములు అధికంగా ఆడే అమెరికాలో పిల్లలు తుపాకులు పట్టుకుని తోటిపిల్లలను, ఉపాధ్యాయులను కాల్చి చంపే ఘటనలు ఇటీవల పెరిగిపోతున్నాయి. ఆ వీడియోగేములు, హాలివుడ్ సినిమాలు దిగుమతి చేసుకుని పిల్లలకూ, పెద్దలకూ చూపిస్తున్న మన దేశంలాంటి వర్ధమాన దేశాల్లో కూడా ఇటీవల ప్రజల్లో హింసా ప్రవృత్తి పెరిగిపోతోందని మేధావులు చెబుతున్నారు. రాను రాను కంప్యూటర్లు పెరుగుతున్నాయి, వీడియో గేములు ఆడే పిల్లలు, పెద్దలు పెరుగుతున్నారు, టివి, సినిమాల్లో అశ్లీలతతో బాటు హింసా దృశ్యాలు ఇబ్బడిముబ్బడి అవుతున్నాయి. అందుకే మన దేశంలో కూడా హింసాకాండ పెరుగుతోంది. రానురాను మరింత పెరుగుతుంది కూడా. తస్మాత్ జాగ్రత్త!

*

కొత్త పుస్తకాలు

అవసరమైన కరదీపిక

గడిచిన పాతిక ముప్పై సంవత్సరాలకీ నేటికీ పత్రికారచనా రంగంలోకి వస్తున్నవారి గురించి ఆలోచిస్తే చాలా మార్పు కొట్టొచ్చినట్లు కనబడుతోంది. గతంలో ఈ రంగంలోకి అడుగిడేవారికి ఒక ఉపాధ్యాయుడికుండేంత ముందస్తు శిక్షణ ఉండేది. ఈనాడు అన్ని ఉద్యోగాల్లోకి వచ్చినట్లే ఈ రంగంలోకి కూడా వస్తున్నారు. వచ్చాక ఆయా పత్రికలకు తగినట్లు శిక్షణ ఉంటోంది. ఇలాంటి స్థితిలో జర్నలిస్టయిన యువతకు కట్టా శేఖర్‌రెడ్డి సంపాదకత్వాన ప్రచురించిన "జర్నలిస్టుల కరదీపిక" చాలా అవసరమైన హేండ్ టెస్ట్‌బుక్.



విలేకర్లకు, సబ్‌ఎడిటర్లకు వారాల తరబడి వినాల్సినంత క్లాసు ఓ గంట రెండు గంటల్లో చదువుకోగ్గినంత సులువు చేస్తుందీ కరదీపిక. అంతటి విలువైన సమీకరణ ఈ పేజీలపై ఉంది. ముఖ్యంగా "పత్రికాపదజాలం" అనే భాగంలో కొన్ని పత్రికా పేజీల నమూనాను ఇచ్చి వాటిపై ఇది లీడ్, ఇది సూపర్‌లీడ్, ఇది న్యూస్ బాడీ అని మార్క్ చేసి చూపారు. పఠనామాధ్యమం అయిన పేజీని దృశ్యమాధ్యమంలా చేసిన విధానం ఆసక్తికరంగా ఉంది. రాజకీయ, ఆర్థిక, న్యాయ, శాసన, విజ్ఞాన, వ్యవసాయ, వైద్య, క్రీడా, కళాసాహిత్య రంగాలన్నింటికీ చెందిన పదజాలాల గురించి అర్థం, అర్థవివరణ, వ్యాఖానం ఇలా అన్ని కోణాల్లో నమాచారమిచ్చారు. రకరకాల పదకోశాలు(డిక్షనరీలు) మనకు అందుబాటులో ఉన్నాయి. వాటిని మనకవసరం పడినప్పుడు తెరిచి ఆ పదం వెతుక్కుని దాని అర్థం తెలుసుకుని టక్కున మూసేసి పనిలో పడిపోతాం. మళ్లీ ఏదన్నా పదం గురించి తెలుసుకునే అవసరం పడేంతవరకూ ఆ డిక్షనరీ పుస్తకరాజం మన టేబుల్‌మీదో, షెల్ఫ్‌లోనో కొలువై ఉండిపోతుంది. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి గారన్నట్లు "ఇది సాంప్రదాయ పదకోశ నిర్మాణపద్ధతులకు భిన్నమైంది." అందుకే ఇది నేటి జర్నలిస్టులకు నిజంగా కరదీపికే. ఈ పుస్తకం ఓ పదిపుస్తకాలు వెతుక్కునే బాధనూ తొలగిస్తుంది. ముఖ్యంగా ఆంగ్ల భాషలోని నుడికారాలకు, జాతీయాలకు సమాన తెలుగు నుడికారాలు, జాతీయాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఇది మక్కీ కి మక్కీ అనువాద దోషాల్ని ఎంతగానో నివారిస్తుంది. "వెట్ బ్లాంకెట్" అనే పదానికున్న ఏదుపుముఖం అనే అర్థం తీసుకోకపోతే తడిసిన దుప్పటి అని అనువాదం చేశారనుకోండి... కొంపలంటుకునే సందర్భాలు వస్తాయి. అలాగే నేడు పత్రికా జర్నలిజ వృత్తి పెన్ను కాగితం రాత అనేది మాయమై దాని స్థానంలో కంప్యూటర్, ఇంటర్నెట్టు ఒక అవసరంగా వచ్చి కూర్చుంది. దానికి సంబంధించిన పదకోశం సమకాలీన అవసరాన్ని తీరుస్తుంది. ముద్రణా రంగానికే కాక ఎలక్ట్రానిక్ రంగానికి చెందిన విశేషాలు చేర్చడం అంతకుముందు లబ్దప్రతిష్ఠుల పదకోశాలకు జోడింపు బాధ్యత వహించినట్లయ్యింది. ఇందులో జర్నలిజం అంటే ఏమిటి? అనే భాగం అదనం అనవచ్చు, అతిముఖ్యభాగము అనవచ్చు. ఈ పుస్తకం జర్నలిజంలో ఉన్నవారికే కాదు జనరల్ నాలెడ్జి కావాల్సినవారికీ కావాల్సిన కరదీపికే.

జర్నలిస్టు కరదీపిక, సంపాదకుడు: కట్టా శేఖర్‌రెడ్డి, ప్రచురణ: న్యూ మీడియా కమ్యూనికేషన్స్, పేజీలు: 336, వెల: రూ. 175/- ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో.

- శంకర్



సి.పి. బ్రౌన్ గ్రంధాలయం

మొండి గోడల నుంచి మహా సౌధం దాకా...
వెల: 100/-, పేజీలు: 221
ప్రతులకు:
సి.పి. బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్,
సి.పి. రోడ్, కడప- 516004.



కన్నీటి లిపి

రచన సి. కామేశ్వరరావు
వెల 40/-
పేజీలు: 124
ప్రతులకు: కామేశ్వరరావు,
కళ్యాణి సదనం, విద్యానగర్,
ఎలమంచిలి.



పాటలతో పాఠాలు

ఉపాధ్యాయునిగా, తెలంగాణా సాయుధ పోరాట కమ్యూనిస్టు యోధునిగా, ప్రజా ప్రతినిధిగా జీవించిన అరిబండి లక్ష్మీనారాయణ స్మృతి చిహ్నంగా ఏర్పడిన బాల సాహిత్యం ట్రస్టు వెలువరించిన నాలుగో పుస్తకం గేయాలతో గుణింతాలు.

ప్రాథమిక దశలో పిల్లలు మాతృభాష నేర్చుకోవడానికి ఇంగ్లీషులో లాగా తెలుగులోనూ రైమ్స్ ఉంటే బాగుంటుంది. ఆ కొరతను తీర్చడానికి పి. సరళగారు 'గేయాలతో గుణింతాలు' తీర్చిదిద్దారు. ఈ పుస్తకాలు 'క' నుండి 'హ' వరకు 27 అక్షరాల గుణింతాల పాఠాలు, పాటలతో కూడి ఉన్నాయి. వీనిలో వివిధ రకాల వస్తువులు, జంతువులు, పక్షులు, కీటకాలు, చెట్లు చేమలేగాక వాటి గుణగణాలు, ధర్మాలు, నీతి నియమాల గురించి అనేకానేక పదాలను పరిచయం చేశారు. తెలుగు పదాలతో పాటు వాక్యాలున్న ఇతర భాషల పదాలనూ కూడా వీనిలో పొందుపరిచారు. పిల్లలతో పాటు ఈ పుస్తకం వయోజనలకూ ఉపయోగకరంగా ఉంటుంది.

-కె. పి. అశోక్ కుమార్

"గేయాలతో గుణింతాలు" పి. సరళ, అరిబండి బాల సాహిత్యం ట్రస్టు, హైదరాబాద్-20. వెల 36/- పేజీలు 60. ప్రతులకు ప్రజాశక్తి అన్ని బ్రాంచీలలో దొరుకును.

కాకరకాయ ఊరగాయ

కావలసిన వస్తువులు

కాకరకాయలు	:	పావుకిలో
పచ్చిమిర్చి	:	వంద గ్రాములు
అల్లం	:	కొంచెం
నిమ్మకాయలు	:	ఎనిమిది
ఉప్పు	:	సరిపడా
పసుపు	:	చిటికెడు
ఆవాల పొడి	:	ఆరు స్పూన్లు
నూనె	:	50 గ్రాములు

తయారుచేసే విధానం

కాకరకాయలు, అల్లం కడిగి తుడిచి సన్నని చక్రాల మాదిరిగా తరగాలి. పచ్చిమిర్చి కడిగి పొడవుగా చీలికలు చేయాలి. నిమ్మకాయలు తరిగి రసం తీసి గింజలు తీసివేయాలి. ముక్కలన్నీ ఒక పళ్ళెంలో పోసి ఆవాల పిండి, పసుపు, నూనె, ఉప్పు, నిమ్మరసం పోసి బాగా కలిపి జాడీలోకానీ, సీసాలోగాని పెట్టుకోవాలి. ఈ ఊరగాయ బాగా ఊరి చాలా రుచిగా ఉంటుంది. ఇది అన్నంలోకే గాక పెరుగన్నంలోకి కూడా చాలా బాగుంటుంది. కాకరకాయ ముక్కలు నిమ్మరసంలో ఊరినందున చేదు ఉండదు.

చింతకాయతో ఆవకాయ

కావలసిన వస్తువులు

చింతకాయలు	:	ఒక కిలో
కారం	:	పావు కిలో
ఉప్పు	:	పావు కిలో
నూనె	:	పావు కిలో
పసుపు	:	ఒక స్పూన్
ఆవాల పొడి	:	పావు కిలో

తయారుచేసే విధానం

చింతకాయలు తాజావి పెద్దపెద్దవీ బాగా గుల్లగా అయినవీ తీసుకొని కడిగి తుడిచి రెండు అంగుళాల ముక్కలుగా తరగాలి. వాటిపైనున్న బెరడును వచ్చినంత వరకూ చెక్కు తీసేయాలి. ఆవాలు పొడి చేసుకోవాలి. ఒక పళ్ళెంలో ఆవాల పొడి, కారం, ఉప్పు, పసుపు వేసి నూనె పోసి బాగా కలిపి చింతకాయ ముక్కలను కూడా వేసి బాగా కలిపి జాడీలో పెట్టుకోవాలి. మూడవ రోజు తిరగ కలిపి వాడుకోవచ్చును. ఈ ఆవకాయ చాలా మందికి తెలియదు. మీరు కూడా చేసి రుచి చూడండి.

పుప్పాల కృష్ణమూర్తి



అంతా సైన్సే

సృజన పట్నంలో బిఎస్‌సి చదువుతోంది. ఆమెకు సైన్సంటే చాలా ఆసక్తి. సైన్సు అందరికీ అందుబాటులోకి రావాలని కోరుకుంటోంది. అందుకే జనవిజ్ఞానవేదికలో సభ్యురాలిగా చేరింది. అది నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా తరచుగా పాల్గొంటుంది.

వేసవి సెలవులకు ఇంటికొచ్చిన ఆమెకు చాలా సంగతులు తెలిశాయి. గత పక్షం రోజులుగా ఊళ్లో ఎక్కడోచోట గుడిసెలు తగలబడుతున్నాయి. గ్రామస్తులంతా భయంతో, ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన పడసాగారు. కొంతమంది 'ఇది తప్పక చేతబడి చేయడంవలన జరుగుతున్న ఉపద్రవమే' అని అనుకున్నారు. మరికొంతమంది 'ఏదో అదృశ్యశక్తి మన గ్రామం మీద కక్షగట్టింది. గ్రామంలోని మనుషుల్ని కూడా క్రమేపీ బలిగొంటుందేమో?' అని భయంతో మాట్లాడుకోసాగారు. గ్రామంలో రకరకాల పుకార్లు వ్యాపించసాగాయి. ఎవ్వరూ రాత్రివేళ కాలు బైట పెట్టడం లేదు. గ్రామంలో దయ్యం తిరుగుతోందని, దానికంట బడితే ఎవర్నయినా గొంతు కొరికి రక్తం తాగుతుందని గుసగుసలాడుకోసాగారు.

ఓనాడు గ్రామంలోనివారంతా సమావేశమై 'మనం ఈ దయ్యాన్ని పారదోలకుంటే సుఖంగా బతకలేం. జగ్గుతండాలో జగ్గా అని మాంచి మంత్రగాడున్నాడు. అతణ్ణి తీసుకొచ్చి బాగుచేయించామంటే ఇంకెవరి ఇళ్లూ తగలబడే ప్రసక్తే వుండదు. రామన్నగూడెంలో ఇలాగే జరిగితే అతనితోనే నయం చేపించారు. ఇందుకు ఐదు వేలదాకా ఖర్చవుతుంది. ఇంటికి యాభై చొప్పున మనం చందాలు వేసుకోవాల్సి వుంటుంది' అని మాట్లాడుకోసాగారు.

అక్కడే వున్న సృజన 'దయచేసి నేను చెప్పేది కూడా వినండి. ఇది దయ్యం చేస్తున్న పనో, మరో అదృశ్యశక్తి చేస్తున్న పనో కాదు. ఇందులో తప్పకుండా మనిషి ప్రమేయం వుంటుంది. అసలు దయ్యాలే లేవని సైన్స్ చెబుతుంటే మీరు మంత్రగాళ్ల పేరుతో డబ్బు వృధా చేసుకోవడం అంత మంచిది కాదు. నాకో వారం రోజుల సమయం ఇవ్వండి. ఈ గుడిసెలు కాలే రహస్యమేంటో కనుక్కుంటా' అని పెద్దవాళ్లతో మాట్లాడింది.

'సరే. ఈ అమ్మాయినీ ప్రయత్నం చేయనీ. ఏం జరుగుతుందో చూద్దాం. ఒకవేళ విఫలమైతే అప్పడెలాగూ మంత్రగాడిని ఆశ్రయించకతప్పదు' అని నిర్ణయించారు. ఇళ్లు కాలకుండా చూసే బాధ్యతను సృజన మీద వదిలిపెట్టారు.

ధైర్యవంతులైన యువతీయువకులు కొంతమంది ఆమెతో చేరారు. వాళ్లందరినీ జట్లుగా విభజించి 'రాత్రి ఏదో జరుగుతుందని నా అనుమానం. బజారుకో జట్టు చొప్పున రాత్రివేళ మనం కాపలా కాయాలి. ఏ ప్రమాదం జరిగినా లేదా అసలు దొంగ దొరికినా వెంటనే విజిల్ ఊదండి' అని జట్టుకో విజిల్ ఇచ్చింది. యువతీయువకులంతా చెట్లమీద దాక్కుని, గోడల మాటున నక్కి జాగ్రత్తగా కాపలా కాయసాగారు. మూడోనాడు అర్ధరాత్రి, గొల్లబజారులో ఒక వ్యక్తి సీసాలోని ద్రవాన్ని గబగబా పూరి గుడిసెపై చల్లసాగాడు. సృజన, ప్రసన్న, ప్రదీప్‌లు నిశ్శబ్దంగా గోడక్రీనీడలో వెళ్లి గబాల్న అతణ్ణి ఒడిసి పట్టుకుని చేతిలోని సీసా లాక్కున్నారు. అతను పెనుగులాడుతూ విదిలించుకుని పారిపోవాలని చూశాడు. కాని వారు అతణ్ణి గట్టిగా పట్టుకుని విజిల్ ఊదారు. మిగిలిన వాళ్లంతా బిలబిలమంటూ పరిగెత్తుకుని వచ్చి అతణ్ణి చెట్టుకు కట్టివేశారు.

ఆ వ్యక్తి మరునాడు పొద్దున్నే గ్రామస్తుల ముందు అసలు విషయం చెప్పాడు. 'నాపేరు కోట్యా. నాది జగ్గు తండా. సారా పోపించి డబ్బులిస్తాను. ఈ సీసాలోని ద్రవాన్ని పూరిళ్లమీద చల్లమని జగ్గా చెప్పాడు. అందుకే చల్లుతున్నాను. అసలు సీసాలోని ద్రవమేంటో నాకు తెలీదు. నన్ను మన్నించి వదిలిపెట్టండి' అని వేడుకున్నాడు.

సృజన అప్పుడు గ్రామస్తుల్ని ఉద్దేశించి 'ఈ సీసాలో వున్నది భాస్వరం కలిపిన నీళ్లు. వేడి తగలగానే మండే గుణముంది భాస్వరానికి. తాటాకులపైనా, జమ్ముపైన పడిన భాస్వరం ఈ మేనెల ఎండకు అంటుకుని మండుతోంది. అగ్గిపుల్ల చివరన వుండేది కూడా భాస్వరమే. కావాలంటే చూడండి' అని తను తెచ్చిన పచ్చ భాస్వరాన్ని ఒక తాటాకుమీద వుంచి ఎండలో పెట్టింది. ఎండ వేడిమికి అంటుకుని, తాటాకు మండసాగింది కొద్దిసేపట్లోనే. ఇలా మండటమనేది భాస్వరం యొక్క సహజ లక్షణం. మీరు దీన్నే మహిమని, దయ్యమని అనుకున్నారు. మీరు మంత్రగాడిని ఆశ్రయించాలనే జగ్గా వీడిని పంపాడు. వాడికి మంత్రాలు రావు. ఏమీరావు. వట్టి మోసగాడు. మీ మూఢత్వాన్ని ఆసరా చేసుకుని డబ్బు సంపాదించాలనుకున్నాడు' అని వివరంగా చెప్పింది.

గ్రామ ప్రజలకు సత్యం బోధపడింది. కోట్యాను పోలీసులకు అప్పగించారు ప్రజలు. జగ్గా విషయం తెలుసుకుని అతణ్ణి కూడా అరెస్టుచేసి ఇరువునీ జైలుకు పంపారు పోలీసులు.